# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

1.04.2026 బుధవారం Wednesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 250 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.



9119949944

7897222788 - 7897222789





## ట్యాంక్ బండ్ శివకు ముఖ్యమంత్రి అండ

రూ. 5 లక్షల ఆర్థిక సాయం, కుమారుడికి హోం గార్డు ఉద్యోగం!

- డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలనిఆదేశం
- స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్..
- మానవత్వానికి నిదర్శనమన్న శివ కుటుంబం

3

## ఇరాన్‌పై అమెరికా దాడులు




4

# మూసీపై ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ



- నిర్వాసితులు, డిఫెన్స్ భూములపై సంప్రదింపులు
- విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ
- 24 గంటలూ అందుబాటులో కేబినెట్ సబ్ కమిటీ
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్, మార్చి 31:** మూసీ పునరుజ్జీవ పనులను ప్రజాస్వామ్యయుతంగా చేపడుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మూసీపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్ లో మెయిల్ ఐడీ ద్వారా మూసీ పునరుజ్జీవంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్ లైన్ లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటినీ అధికారులతో కలిసి విశ్లేషణ చేస్తామని చెప్పారు. అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని

మిగతా 3లో



నలంద ఆలయంలో వద్ద

## తొక్కిసలాట

8మంది మహిళా భక్తులు మృత్యువాత

బీహార్‌లోని నలంద జిల్లాలో గల శీతల మాత ఆలయంలో మంగళవారం ఉదయం జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది భక్తులు దుర్మరణం చెందారు.

4



## మార్జిన్ కోసం..

చికెన్ దుకాణాదారుల ఆందోళన

నేటి నుంచి బంద్ పాటిస్తామని ప్రకటన

2

## ఆటో సర్వీసులకు గ్యాస్ కొరత

తక్షణమే సమస్య పరిష్కరించండి

కేంద్రమంత్రి హరిదీప్ సింగ్ పూరికి ఉత్తమ్ లేఖ



3



ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి

## సీఐడీ నోటీసులు

4వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

3

## పసుపు రైతుకు భరోసా

తడిసిన పసుపు కొనుగోళ్లకు నిర్ణయం

మార్కెట్‌యార్డు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



3



## ఇప్పపూవు సారాకు వేల ఏళ్ల చరిత్ర

- దీనిపై మాట్లాడితే దుష్ప్రచారమా?
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

2



ఇద్దరు బిడ్డలను చంపి

## ఆత్మహత్య

కూకట్‌పల్లిలో దారుణ ఘటన

3

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో ఓ మహిళ తన ఇద్దరు కుమారులను చంపి, తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

# పగలు భగభగ.. సాయంత్రం వాన

తెలంగాణలో ఒక్కసారిగా మారిన వాతావరణం



- పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని సూచన
- పలు జిల్లాల్లో అకాల వర్షాలు.. 41.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- రాబోయే 4 రోజులు ఇదే పరిస్థితి..
- ఈదురు గాలులతో వడగళ్ల వాన

3

## అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు

- కేరళ ప్రచారం కోసం 30నే అసెంబ్లీ వాయిదా
- కాళేశ్వరంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికావు
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేత హరీష్ రావు

2



2

నేటి సాక్షి
కరీంనగర్
బుధవారం
1 ఏప్రిల్ 2026



# అసెంబ్లీ సమయాన్ని వృథా చేసిన ప్రభుత్వం!

## కేరళ ప్రచారం కోసమే సభ వాయిదా..

## బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత హరీశ్ రావు..

### కాళేశ్వరంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలను ఖండించిన మాజీ మంత్రి

**హైదరాబాద్, మార్చి 31 :** ప్రజా సమస్యలు చర్చకు రాకుండా ప్రభుత్వం అసెంబ్లీ సమయాన్ని వృథా చేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కేరళ ఎన్నికల ప్రచారం కోసం సభను 30వ తేదీనే వాయిదా వేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నారని ఒకరోజు.. కేరళ నుండి వస్తున్నారని మరోరోజు గంటల కొద్దీ కాలయాపన చేశారని మండిపడ్డారు. విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇచ్చే పేరుతో కూడా విలువైన సమయాన్ని పాడు చేశారని ధ్వజమెత్తారు. సభలో ముఖ్యమంత్రి వాడుతున్న భాష అనాగరికమని.. తలలు తీస్తామన్న సభ్యులపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలు సరికావని హరీశ్ రావు ఖండించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రమే అన్ని అనుమతులు ఇచ్చిందని.. గడ్కరీ వంటి ప్రముఖులు దీనిని తెలంగాణకు వరప్రదాయినిగా కొనియాడారని గుర్తు చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో కూడా కాళేశ్వరం వల్ల సాగు భూమి పెరిగిందని అంగీకరించారని తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం అసెంబ్లీలో ఇదే విషయాన్ని నివేదికలో పేర్కొన్నారని వివరించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రాజెక్టుపై బురద జల్లుతున్నారని ఆయన విమర్శించారు. కేవలం 50 కోట్ల రూపాయలు కేటాయిస్తే మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని.. దీనిపై గత రెండేళ్లలో 20 లేఖలు రాసినా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించడం లేదని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీపై ఉన్న కోపాన్ని రైతులపై చూపవద్దని హితవు పలికారు. సీఆర్ పాటిల్ క్షేత్రస్థాయిలో రైతులను అడిగితే నీళ్లు ఎలా వచ్చాయో తెలుస్తుందని సూచించారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కే ప్రయత్నం చేసినా.. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

# బెంగుళూరులో యువ టెక్కీ దంపతుల ఆత్మహత్య

### యువకుడిది సిద్దిపేటగా గుర్తింపు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు





**బెంగళూరు, మార్చి 31:** బెంగళూరులో విషాదం జరిగింది. తెలంగాణ సిద్దిపేటకు చెందిన యువ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముందుగా భర్త గదిలో ఆత్మహత్య చేసుకోగా, ఇది తెలిసిన భార్య వెంటనే బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని సిద్ధిపేట ప్రాంతానికి చెందిన భానుచందర్ రెడ్డి (32), అతడి భార్య బీబీ షాజియా సిరాజ్ (31) ఇద్దరూ కలిసి బెంగళూరులోని కోతనూర్ ఏరియాలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. వీరిద్దరూ వృత్తిపరంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే. వీరి పెళ్ళై తొమ్మిది సంవత్సరాలు అవుతోంది. మొదట ఇద్దరూ లివ్ ఇన్ రిలేషన్‌లో ఉండి, ఆ తర్వాత కొంతకాలానికి పెళ్లి చేసుకున్నారు. అయితే, పెళ్ళైనప్పటి నుంచి వీరిద్దరి మధ్యా విబేధాలు తలెత్తాయి. దీంతో తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో సోమవారం భానుచందర్ రెడ్డి తన గదిలోపల తలుపు పెట్టుకుని, ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సాజియా సిరాజ్ ఎంత పిలిచినా లోపలి నుంచి స్పందన రాలేదు. దీంతో ఆమె సెక్యూరిటీతోపాటు చుట్టుపక్కల వాళ్లను పిలిచింది. వారు వచ్చి తలుపు బద్దలుకొట్టి చూసేసరికి భానుచందర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది చూసి దిగ్భ్రాంతికి గురైన భార్య సాజియా వెంటనే అదే అపార్ట్‌మెంట్ 17వ అంతస్థు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు జరుపుతున్నారు. వీరి మృతికి వైవాహిక కలహాలతోపాటు భాను చందర్ రెడ్డి అనారోగ్యం కూడా ఒక కారణం అయ్యుండొచ్చని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పూర్తి విచారణ అనంతరం అసలు విషయాలు తెలిసే అవకాశం ఉంది. అధిక ఒత్తిడి, అనారోగ్యం, మానసిక సమస్యలు తదితర కారణాలేమైనా అయ్యుండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదిక వస్తే తప్ప ఈ దంపతుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని పోలీసులు వివరించారు. మరోవైపు మృతుల తల్లిదండ్రులు ఇప్పటికే బెంగళూరు చేరుకున్నారు. వీరి మృతితో ఇరు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# పీఆర్సీ, డీఏ విడుదల చేయకపోతే టెన్త్ స్పాట్ బహిష్కరిస్తాం

**నల్లగొండ, మార్చి 31:** రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ, డీఏ విడుదల చేయకపోతే పదో తరగతి స్పాట్ బహిష్కరిస్తామని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. నల్లగొండతో పాటు పలు ప్రాంతాలోని పాఠశాలలో ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ సన్మానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంగళవారం రాత్రి వరకు పీఆర్సీ, డీఏ, ఉపాధ్యాయులకు, పెన్షనర్స్‌కు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుల గణన చేసిన సర్వే రెమ్యూనరేషన్స్ సహితం ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేటికి అమలు చేయకపోవడంతో తీవ్ర మనోవేదనలో ఉన్నారన్నారు.

# ఇప్ప సారాకు వేల ఏళ్ల చరిత్ర

- నాపై దుష్ప్రచారం ఎందుకు?
- కల్తీ సారా వద్దంటే బద్నాం చేస్తారా అని ఎమ్మెల్యే ఆగ్రహం..
- సినీ తారలు ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్ టెస్ట్ చేయించుకోవాలి..
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 31 :** తాను ఇప్పపూవు సారా గురించి మాట్లాడితే కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. కల్తీ సారా తాగవద్దని సూచిస్తే తనను బద్నాం చేయడం ఏమిటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులకు వ్యక్తిగత గోప్యత అనేది లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు మద్యం తయారు చేస్తే తప్పా? కార్పొరేట్ కంపెనీలు చేస్తే ఒప్పా? అని ప్రశ్నించారు. ఇప్ప సారాకు మూడు వేల ఏళ్ల నాటి శతాబ్దాల చరిత్ర ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

### ఆరోగ్యానికి మేలు చేస్తుంది

ఇప్ప సారాను అసలైన 'ఇండియన్ లిక్కర్' అని అనిరుధ్ రెడ్డి అభివర్ణించారు. ఈ రకమైన సారా తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని.. గతంలో దీనిని తాగిన వారు 110 ఏళ్ల వరకు ఆరోగ్యంగా బతికారని వివరించారు. తన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఆయన మండిపడ్డారు. కల్తీ మద్యానికి దూరంగా ఉండాలన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన ఇప్ప సారాకు ఉన్న గొప్పతనాన్ని విస్మరించి తనను తప్పుగా చిత్రీకరించడం సరికాదని హితవు పలికారు.

### సినీ తారలకు డ్రగ్ టెస్ట్ సవాల్

ఈ సందర్భంగా సినీ తారలపై అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను స్వచ్ఛందంగా డ్రగ్ టెస్ట్ చేయించుకున్నానని.. అలాగే సినీ నటులు కూడా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వారిపైనే ఎక్కువగా డ్రగ్స్ ఆరోపణలు వస్తున్నాయని గుర్తు చేశారు. రాజకీయ నాయకులపై ఇలాంటి పుకార్లు తక్కువేనన్నారు. నటులు ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్ టెస్ట్ చేయించుకోవాలని.. ఫలితం నెగెటివ్ వస్తేనే షూటింగ్‌లలో పాల్గొనేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ బారిన పడిన వారు చిత్ర పరిశ్రమలోనే ఎక్కువగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్యం.. ధూమపానం వంటి వాటికి దూరంగా ఉంటారని.. తాము కూడా డ్రగ్స్ కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.

# కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

- ఏప్రిల్ 4వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశం!
- పోలీసు అధికారులపై అనుచిత వ్యాఖ్యల కేసులో సీఐడీ నోటీసులు..
- సాక్ష్యాలను తారుమారు చేయవద్దని అధికారుల హెచ్చరిక..

**హైదరాబాద్, మార్చి 31 :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 29వ తేదీన సమ్మక్క సారక్క జాతర వద్ద జరిగిన గొడవలో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తును ప్రభుత్వం సీఐడీకి అప్పగించడంతో.. ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు ఆదేశించారు. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా ఈ నోటీసులు ఇచ్చారు.

### పోలీసుల విధులకు ఆటంకం

సమ్మక్క సారక్క జాతర సమయంలో రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగించారని కౌశిక్ రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు అసౌకర్యం కలిగించడమే కాకుండా.. విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకున్నారని కేసులో పేర్కొన్నారు. ఉన్నత స్థాయి పోలీస్ అధికారులను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించారని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయ్యాయి.

### సహకరించకపోతే కఠిన చర్యలు

వచ్చే నెల 4వ తేదీ ఉదయం 11:30 గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. వచ్చేటప్పుడు తన గుర్తింపు పత్రాలు.. ఈ కేసుకు సంబంధించిన ఇతర పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని.. సాక్ష్యాలను చెడగొట్టే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. ఒకవేళ నోటీసులను పట్టించుకోకుండా విచారణకు గైర్హాజరైతే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐడీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



# చికెన్ షాపుల బంద్.. మార్జిన్ పోరు!

- కిలోకు 30 రూపాయల లాభం కావాలని డిమాండ్..
- నేటి నుండి నిరవధిక సమ్మెకు పిలుపు..
- చికెన్ దుకాణ యజమానుల సంఘం



**హైదరాబాద్, మార్చి 31 :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి చికెన్ దుకాణాలు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే మార్జిన్లను పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాపుల యజమానుల సంఘం హెచ్చరించింది. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఇస్తున్న లాభం చాలా తక్కువగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఇరవై ఏళ్లుగా కిలోకు 26 రూపాయల మార్జిన్ ఇచ్చేవారని.. కానీ ఇటీవల దానిని 16 రూపాయలకు తగ్గించారని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలతో దుకాణాలు నిర్వహించడం అసాధ్యంగా మారిందని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కిలో చికెన్ పై కనీసం 30 రూపాయల మార్జిన్ ఇవ్వాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. పెరిగిన అద్దెలు.. కరెంటు బిల్లులు.. పనివారి జీతాల దృష్ట్యా పాత మార్జిన్లతో బతకలేమని స్పష్టం చేశారు. మార్జిన్ పెంపుపై పౌల్ట్రీ యాజమాన్యాల నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ నిరసన ఆగదని ప్రకటించారు.

### వినియోగదారులకు ఇబ్బందులు

దుకాణదారుల ఆకస్మిక బంద్ నిర్ణయంతో సామాన్య ప్రజలకు చికెన్ దొరకని పరిస్థితి ఏర్పడింది. తక్కువ మార్జిన్ వల్ల తమ జీవనోపాధి సవాల్‌గా మారిందని.. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వ్యాపారులు చెబుతున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని.. ప్రభుత్వం కూడా ఇందులో జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# ప్రజా పాలన ప్రగతిపై సీఎస్ సమీక్ష!

**హైదరాబాద్, మార్చి 31 :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు పురోగతిపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణరావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏప్రిల్ 2 నుండి గ్రామ సభలు.. వార్డ్ సభలను ఇప్పటికే జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పారదర్శకంగా.. క్రమబద్ధంగా ఈ సమావేశాలు జరగాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన అమలు.. ప్రజల భాగస్వామ్యం.. విభాగాల సమన్వయం ఈ కార్యక్రమ విజయానికి కీలకమని స్పష్టం చేశారు.

### పథకాలపై విస్తృత అవగాహన

ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలు.. సంక్షేమ కార్యక్రమాలు.. బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ఈ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరించి.. పథకాల ప్రభావాన్ని అంచనా వేసి మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్లానింగ్ శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ గ్రామ సభల నిర్వహణకు అనుసరించాల్సిన కార్యాచరణపై అధికారులకు వివరణ ఇచ్చారు.

### ఆరోగ్య వారోత్సవాలు.. పన్ను వసూళ్లపై గుర్తింపు

మున్సిపల్ శాఖ కార్యదర్శి టీ.కే. శ్రీదేవి మాట్లాడుతూ.. వార్డ్ సభలలో వంద శాతం పన్ను వసూలు సాధించిన సిబ్బందిని సత్కరించాలని సూచించారు. హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్తు.. ఏప్రిల్ 6 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొని ప్రగతి నివేదికలను సమర్పించారు.





# ట్యాంక్ బండ్ శివకు సీఎం అండ

## రూ. 5 లక్షల ఆర్థిక సాయం, కుమారుడికి హోం గార్డు ఉద్యోగం!

**హైదరాబాద్, మార్చి 31:** హుస్సేన్ సాగర్ (ట్యాంక్ బండ్) వద్ద ఆపదలో ఉన్న వందలాది మంది ప్రాణాలను కాపాడిన సాహసి 'ట్యాంక్ బండ్ శివ'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. ఎందరికో పునర్జన్మ ప్రసాదించిన శివ.. ప్రస్తుతం ఉపాధి లేక పేదరికంలో మగ్గుతున్నారనే విషయాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, మంగళవారం ఆయనను పిలిపించి ప్రభుత్వం తరపున భారీ సాయాన్ని అందజేశారు. శివ కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పాటు, ఆయన కుమారుడు వేణుమాధవ్‌కు హోం గార్డుగా నియామక పత్రాన్ని సీఎం స్వయంగా అందజేశారు. శివ దీన స్థితిని గమనించిన సీఎం రేవంత్ రెడ్డి, కేవలం ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా ఆయనకు శాశ్వత నివాసం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా శివ కుటుంబానికి తక్షణమే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, తన జీవనోపాధి కోసం ట్యాంక్ బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని శివ కోరగా, సీఎం సానుకూలంగా స్పందించి ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం చేతుల మీదుగా ఈ భారీ సాయం అందుకోవడం పట్ల ట్యాంక్ బండ్ శివ, ఆయన కుటుంబ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న తమను గుర్తించి అండగా నిలిచిన సీఎంకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణాలు కాపాడే సాహసానికి ప్రభుత్వం ఇచ్చిన ఈ గుర్తింపు పట్ల నగర ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పసుపు రైతులకు భరోసా

## మార్కెట్‌యార్డు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



**హైదరాబాద్, మార్చి 31:** పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు భారీగా వస్తోంది. 1,500 టార్పాలిన్ల పంపిణీ కోసం బిడ్డింగ్ పూర్తి చేశాం. పసుపు కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించాం. మేలు రకం పసుపు పంటకు ప్రభుత్వం ఖరారు చేసిన ధర చెల్లిస్తున్నాం. రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం అని తుమ్మల పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు...ఈ మేరకు పసుపు రైతులకు ఊరటనిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో పసుపు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ మంత్రి తుమ్మల వార్నింగ్ ఇచ్చారు. . నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిందన్నారు. 4,500 కుప్పలు (27,400 బస్తాలు) యార్డుకు చేరిందన్నారు. 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉందని చెప్పిన మంత్రి.. పసుపు రక్షణకు 1,500 టార్పాలిన్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గాలులు, వర్షాలతో 70 - 80 కుప్పలు తడిశాయన్నారు. దీని కారణంగా దాదాపు 40 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన పసుపును పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డ్ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

# కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

## 4వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 31:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు పంపింది. జనవరి 29వ తేదీన సమ్మక్క సారక్క జాతర దగ్గర జరిగిన గొడవలో కరీంనగర్ కమిషనర్?పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐడీకి అప్పగించడంతో ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్ నగరంలో ఉన్న సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. హుజురాబాద్ పోలీస్ స్టేషన్ కేసు నంబర్ 30/2026 నమోదైంది. సమ్మక్క సారక్క జాతర సమయంలో రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారనేది కౌశిక్ రెడ్డిపై ఉన్న ఆరోపణ. ప్రజలకు అసౌకర్యం కలిగించారని, పోలీసుల విధులకు అడ్డంకి కలిగించారని, పోలీస్ అధికారులపై అవమానకర వ్యాఖ్యలు చేశాడని కౌశిక్ రెడ్డిపై ఆరోపణలు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించినట్టు కేసు నమోదైంది. ఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏప్రిల్ 4న ఉదయం 11:30కు విచారణకు హాజరు కావాలని పాడి కౌశిక్ రెడ్డికి నోటీసుల్లో స్పష్టం చేశారు. గుర్తింపు పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లు తీసుకురావాలని.. విచారణకు సహకరించాల్సిందిగా కోరారు. సాక్ష్యాలను చెడగొట్టవద్దని హెచ్చరించారు. నోటీసును పట్టించుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఇద్దరు బిడ్డలను చంపి ఆత్మహత్య

**హైదరాబాద్, మార్చి 31:** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో ఓ మహిళ తన ఇద్దరు కుమారులను చంపేసింది. ఆ తరువాత తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆ మహిళ తన ఇద్దరు పిల్లలు కార్తీక్ (12), కౌశిక్ (10) లతో కలిసి రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటోంది. కుటుంబ తగాదాల కారణంగా భర్త ప్రవీణ్ దూరంగా ఉంటున్నాడు. అయితే, ఇటీవలే అతను రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ.. తన ఇద్దరు కొడుకులను చంపేసింది. ఆ తరువాత తాను కూడా ఆత్మహత్య చేసుకుంది. దీనిని గమనించిన స్థానికులు.. కూకట్‌పల్లి పీఎస్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాలను పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి ఇంతటి దారుణానికి పాల్పడటానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నారు.

# మూసీపై ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ సీఎం తెలిపారు. మూసీ నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసీ ఫేస్ 1, ఫేస్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసీ నిర్వాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్ తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ కేబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మను చౌదరి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.



# పగలు భగభగ.. సాయంత్రం వాన



**హైదరాబాద్, మార్చి 31:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పగటిపూట ఎండలు మండిపోతుండగా, సాయంత్రం వేళ అకస్మాత్తుగా మేఘాలు కమ్ముకొని వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం భిన్నంగా కనిపిస్తోంది. సోమవారం రాష్ట్రంలోని దాదాపు 30 జిల్లాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా ఆరుట్లలో అత్యధికంగా 41.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లోనూ ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఎండల నేపథ్యంలో వాతావరణ శాఖ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం గందరగోళంగా ఉంది. ఇబ్రహీంపట్నం, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్, ఉప్పల్, నాగోల్ వంటి ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మార్చి 31 ఉదయం నుంచే కొమరం భీం ఆసిఫాబాద్, నిర్మల్, కరీంనగర్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆకాశం మేఘావృతమై ఉండటంతో పగటిపూట కూడా చీకట్లు అలుముకున్నాయి. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, కొన్ని చోట్ల వడగళ్ల వాన పడే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు.

- ఒక్కసారిగా మారిన వాతావరణం
- పలుచోట్ల వర్షం కురిసే అవకాశం
- పలు జిల్లాల్లో అకాల వర్షాలు.. 41.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- రాబోయే 4 రోజులు ఇదే పరిస్థితి..
- ఈదురు గాలులతో వడగళ్ల వాన

## అన్నదాతల ఆందోళన

ఈ అకాల వర్షాలు రైతులను నిలువునా ముంచేస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న మామిడి పంట ఈదురు గాలుల వల్ల నేలపాలవుతుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల తోటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. రాబోయే నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో ఇదే విధమైన భిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు మరియు రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# ఆటో సర్వీసులకు గ్యాస్ కొరత

## తక్షణమే సమస్య పరిష్కరించండి

## కేంద్రమంత్రి హరిదీప్ సింగ్ పూరికి ఉత్తమ్ లేఖ

**హైదరాబాద్, మార్చి 31:** హైదరాబాద్‌లో ఎల్‌పీజీ ఆటోరిక్షాలు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరతపై కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పీజీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా 100 శాతం కొనసాగించాలని కోరారు. కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ రంగం తీవ్రంగా ప్రభావితమైందన్నారు. తెలంగాణలో సుమారు 1 లక్ష ఎల్‌పీజీ ఆటోరిక్షాలు రోడ్లపై



నడుస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల వాటా కేవలం 20శాతం మాత్రమే ఉంది. ప్రైవేట్ కంపెనీలు 80 శాతం మార్కెట్‌ను ఆక్రమించాయి. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయి. రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు డ్రై అవుట్ పరిస్థితి నెలకొంది. ప్రజా రవాణాలో అంతరాయం, ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. ప్రైవేట్ కంపెనీలకు ఖాజల నుంచి సరఫరా అంతరాయం ఏర్పడిందని లేఖలో మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ అందుబాటు ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75, ప్రైవేట్ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.93 వరకు విక్రయిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు అవసరమని.. కేంద్రం తక్షణ జోక్యం వల్ల ప్రజా రవాణా సేవలు నిలకడగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# శ్రీశైలంలో అక్రమ విద్యుత్ ఉత్పత్తి



- నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఏపీ ప్రభుత్వం..
- నీటి కష్టాలు వచ్చే ప్రమాదంపై హెచ్చరిక..
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, మార్చి 31:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం నుండి అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనివల్ల వేసవిలో తాగునీటి కటకట ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి చేయవద్దని నిబంధనలు ఉన్నాయని.. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు చేయవద్దని ఉత్తర్వులు ఉన్నాయని గుర్తు చేశారు. తాగునీటి అవసరాల కోసం మాత్రమే ప్రాజెక్టు నీటిని వినియోగించాలని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని తెలిపారు.

## కోర్టు తీర్పులను బేఖాతరు చేస్తున్నారు

తెలంగాణ హైకోర్టులో గతంలో దాఖలైన పిటిషన్ పైన జస్టిస్ పినాకి గోష్ ఇచ్చిన తీర్పు కూడా విద్యుత్ ఉత్పత్తికి వ్యతిరేకంగా ఉందని జూపల్లి వివరించారు. దొంగతనంగా కరెంటు తీసుకోవాల్సిన అవసరం ఏపీకి ఏముందని ప్రశ్నించారు. ధర్నా చేస్తామని హెచ్చరించడంతోనే ఏపీ ప్రభుత్వం పంపింగ్‌ను నిలిపివేసిందని వెల్లడించారు. పాలమూరు రైతాంగానికి.. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## రాష్ట్ర హక్కులను కాపాడుతాం

నీటి పంపకాల అంశం ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో ఉందని.. 69 శాతం తెలంగాణకు.. 31 శాతం ఆంధ్రకు వాటా రావాల్సి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర హక్కులను ప్రభుత్వం ఖచ్చితంగా కాపాడుతుందని స్పష్టం చేశారు. అక్రమంగా నీటిని తరలిస్తే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. మంత్రి వ్యాఖ్యలతో తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# హైదరాబాద్‌లో జయలలిత ఇల్లు సీజ్!

- ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో జీహెచ్ఎంసీ కఠిన చర్య..
- 2017 నుండి సుమారు 83 లక్షల రూపాయల బకాయిలు..

**హైదరాబాద్, మార్చి 31:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి.. దివంగత జయలలితకు చెందిన హైదరాబాద్ నివాసాన్ని అధికారులు సీజ్ చేశారు. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో జీహెచ్ఎంసీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీనగర్ కాలనీలో ఉన్న ఈ భవనానికి సంబంధించిన పన్ను బకాయిలపై అధికారులు ఫిబ్రవరిలోనే నోటీసులు జారీ చేశారు. జయలలిత వారసుల నుండి ఎటువంటి స్పందన రాకపోవడంతో సోమవారం ఈ ఇంటిని సీజ్ చేశారు. 2017 నుండి ఈ ఇంటికి సంబంధించి సుమారు 83 లక్షల రూపాయల ఆస్తి పన్ను బకాయిలు ఉన్నట్లు సమాచారం.

## భారీగా పేరుకుపోయిన బకాయిలు

మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పించిన వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్) రాయితీ పోను.. మొత్తం 82,91,822 రూపాయలు చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ ఏఎంసీ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది శ్రీనగర్ కాలనీలోని ఈ భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఈ భవనంలో ప్రైవేట్ కార్యాలయం నిర్వహించేవారని అధికారులు పేర్కొన్నారు. గడువు ముగిసినా స్పందించకపోవడంతోనే ఈ చర్యలు చేపట్టాల్సి వచ్చిందని వివరించారు.

## నివాస భవనంగా మార్చాలని విన్నపం

ఈ భవనాన్ని 2017 నుండి నివాస అవసరాలకే వాడుతున్నామని.. కాబట్టి దీనిని రెసిడెన్షియల్ విభాగం కిందకు మార్చాలని జయలలిత మేనల్లుడు దీపక్



జయకుమార్ గతంలో అధికారులను కోరారు. అయినప్పటికీ పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు సీజ్ చేశారు. నిబంధనల ప్రకారం బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే సీజ్ తొలగిస్తామని స్పష్టం చేశారు. నగరంలో పన్ను ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నేటి సాక్షి TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ బుధవారం 1 ఏప్రిల్ 2026



## సంపాదకీయం

# భారత ఎన్నికల తీరు మారాల్సిందే!

ఎన్నికల సంస్కరణలు చేయకుండా, పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెంచినంత మాత్రాన భారత్ భవిష్యత్ మారదు. రాజకీయ పార్టీలకు మేలు చేసే నిర్ణయాలు తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం లేదు. ప్రధానంగా పదేపదే సభ్యులు కొందరే పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఎన్నికవుతున్నారు. దీనిని అరికట్టాల్సి ఉంది. సీట్లు పెంపు తీరును తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తప్పు పడుతున్నారు. దీంతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని అంటున్నారు. దీనిపైనా చర్చించాలి. దేశంలో ప్రజలకు రాజకీయ అవకాశం రావాలి. ముఖ్యంగా దళిత, గిరిజన, మహిళలకు పెద్ద ఎత్తున అవకాశాలు రావాలి. వారిని ఈ దేశ అధికారంలో భాగస్వామ్యం చేయాలి. కానీ అలా జరగడం లేదు. కేవలం కొన్ని సీట్లు వారికి కేటాయిస్తు న్నాయి. రాకీయంగా దళితులు, గిరిజనులకు కనీసం 50శాతం సీట్లు రిజర్వ్ చేయాలి. అందులోనూ గతంలో వరుసగా ఎన్నికవుతూ వస్తున్న వారిని మళ్లీ పోటీకి దూరం చేయాలి. అలాగే రెండు టర్మ్‌లకు మించి అవకాశం లేకుండా సంస్కరణలు చేయాలి. లేదా రాజ్యాంగ సవరణ చేయాలి. అప్పుడే ఇప్పుడు పాతుకు పోయిన వారు బయటకు పోతారు. పార్లమెంట్, అసెంబ్లీలో కొత్తతరం ప్రవేశిస్తుంది. కొత్తగా ఆలోచిస్తారు. ఇటీవల పార్లమెంటులో ఎన్నికల సంస్కరణలపై చర్చ తూతూ మంత్రంగా సాగింది. అసలు విషయాలను పక్కదారి పట్టించేలా చేశారు. ఇలాంటి విషయాలను ఏ ఒక్కరూ ప్రతిపాదించలేదు. అధికార బిజెపి లేదా ఎన్‌డిఎ కూడా పక్కాగా ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలు ప్రకటించడంలేదు. విపక్షనేత రాహుల్ కేవలం సర్‌ను వ్యతిరేకించడం మాత్రమే అలవాటు చేసుకున్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఊరేగుతున్న రాహుల్‌కు రాజ్యాంగంలో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే ఎన్నికల ప్రక్రియ విఫలం అవుతోంది. డబ్బున్న వారే ఎన్నికవుతున్నారు. ఒక్కరే పదేపదే చట్టసభల్లో ఉంటున్నారు. వీలయితే జీవితాంతం చట్టసభ సభ్యులుగా ఉంటున్నారు. ఇక దొంగ ఓట్లను చేర్పించి, ఓట్లను చోరీ చేస్తున్నారు. పదేపదే ఎన్నికల నిర్వహణతో దేశ ఖజానాపై భారం మోపుతున్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక అంటున్న బిజెపి కూడా దీనిపై సమగ్ర విధానం ప్రకటించడం లేదు. మన ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాలను చర్చించి, రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. ప్రధానంగా దేశానికి భారంగా మారిన పదేపదే ఎన్నికల నిర్వహణ విధానం మారాలి. అన్ని రాష్ట్రాల్లో ఒకే తడవలో ఎన్నికలు జరిగేలా చూడాలి. రాజకీయ పార్టీలు నిరంతరం ఎన్నికలు ఉండాలని కోరుకుంటున్నాయి. అలాగే తామే నిరంతరం ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో తిష్టవేయాలని చూసుకుంటున్నారు. ఇదే వీరి ఎన్నికల సంస్కరణగా ఉంది. ఇలాంటి ఎన్నికల వల్ల కొందరే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. అలాగే ఒక వ్యక్తి రెండుచోట్ల పోటీ చేసే పద్ధతిని కూడా రద్దు చేయాలి. గతంలో రాహుల్ రెండుచోట్ పోటీ చేశారు. మోడీ చేశారు. ఇప్పుడు తమిళనాట విజయ్ కూడా రెండుచోట్ల పోటీ చేస్తున్నారు. దీనివల్ల కూడా ఖజానాపై భారం పడుతుంది. ఇలాంటి విషయాల్లో అన్ని పార్టీలది ఒకటే దారిగా ఉంది. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగులో నేతలు నియంతలుగా మారుతున్నారు. ఈ క ÷-రమంలో ఇప్పుడు పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెరగడం వల్ల మరికొందరు చట్టసభల్లోకి వస్తారు. దీంతో ఖజానాపై మరింత భారం పడుతుంది. అలాగే వారికి సౌకర్యాలు పెరుగుతాయి. అందువల్ల ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు, జీతభత్యాలు, పెన్షన్లను కూడా రద్దు చేయాలి. ఒక్కో ప్రజాప్రతినిధి రెండేసి పెన్షన్లు కూడా పొందుతున్నారు. పార్లమెంటుకు పనిచేసి, అసెంబ్లీకి ఎన్నికైన వారు రెండుచోట్లా పెన్షన్లు పొందుతున్నారు. అందుకే చట్టసభలకు తప్ప, సభ్యులకు అధికారాలే తక్కువగా ఉంటే సమస్య రాదు. చట్టసభలకు ఎన్నికైన సభ్యులకు అలవిమాలిన సౌకర్యాలను కూడా తగ్గించాలి. పెన్షన్లు తక్షణం ఎత్తేయాలి. 2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఒకే దేశం, ఒకేఎన్నిక అంటే పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ జరగాలి. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరగాల్సిందే. అలాగే దొంగ ఓట్లు లేకుండా పక్కాగా ఓటరు కార్డు ఉండాలి. నిరంతరం ఓటరు జాబితాను సమీక్షించే విధానం రావాలి. ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటేసేలా చట్టబద్ధత ఉండాలి. నేతలు రెండు పర్యాయాలకు మించి పోటీ చేసే అవకాశం లేకుండా చూడాలి. ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి ప్రయోజనాలను సమకూరుస్తుందనే వాదనలో పసలేదు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయని వితండ వాదనతో దీనిని వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఎన్నికల సంస్కరణ అనేది ఓటర్లకు సంబంధించినది మాత్రమే కాదు. యావత్తు భారత జాతికి సంబంధించినది. ఇది పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న ఎంపిల వ్యవహారం అస్సలు కానేకాదు. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన ఓటర్లు తమ ఓటు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సి ఉంది. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లంతా చర్చించాలి. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ చర్చించాలి. ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత చాలా ముఖ్యం అన్న విషయం ఇక్కడ గుర్తించాలి. ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాల కారణంగా రాజకీయ నేతలు అనుసరిస్తున్న వికృతాలను నిరోధించేందుకు పార్లమెంటు చర్చించడం కూడా ముఖ్యం. ప్రధానంగా ప్రజల భాగస్వామ్యం పెరగాలి. పేదలైన ప్రజలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం రావాలి. అవసరమైతే ఇందుకు నిబంధనలు లేదా రిజర్వేషన్లు పెట్టాలి. చట్టసభల్లో నిరంతరం కొత్తవాళ్లు ఎన్నికలైతేనే అవినీతి, మోనోపలి తగ్గుతుంది.

# ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు

- ఆయుధ నిల్వల డిపోపై దాడి



**టెహ్రాన్, మార్చి 31:** ఇరాన్ అణు కేంద్రక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా భీకర దాడులు చేసింది. ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై బంకర్ బస్టర్లతో విరుచుకుపడింది. రెండు వేల పౌండ్ల బంకర్ బస్టర్లతో దాడులు చేయడంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో పంచుకున్నారు. అయితే దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరణా ఇవ్వలేదు. ఇస్ఫహాన్‌లో ఇరాన్ ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు చేసినట్టు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' వెల్లడించింది. ఇస్ఫహాన్‌పై వరుస దాడులు జరగడంతో ఆ ప్రాంతంలో భారీగా మంటలు చెలరేగుతున్నట్టు పేర్కొంది. అయితే ఈ దాడులపై ఇరాన్ ఇప్పటివరకు స్పందించలేదు. కాగా, ఇస్ఫహాన్‌లోని ఓ భూగర్భ కేంద్రంలో సుమారు 540 కిలోల యురేనియం నిల్వలను ఇరాన్ దాచినట్టు వార్తలు వస్తున్నాయి. ఆ యురేనియం నిల్వల లక్ష్యంగానే తాజా దాడులు జరిగినట్టు సమాచారం. కాగా, తమతో ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌పై భారీగా దాడులు చేస్తామని ఇప్పటికే ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికాతో ఒప్పందానికి అంగీకరించేది లేదని ఇరాన్‌కు చెందిన పలువురు కీలక నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికా దాడులకు దిగినట్టు తెలుస్తోంది.

# బెంగాలీలను బీజేపీ అవమానం చేస్తోంది

- నా ముఖం చూసి మాత్రమే ఓటేయండి
- సెంటిమెంట్ మాటలతో మమత ప్రచారం



**కోల్‌కతా, మార్చి 31:** భారతీయ జనతా పార్టీపై పశ్చిమ-బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. బీజేపీని 'అనాగరిక' పార్టీగా అభివర్ణించారు. దేశంలోని బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను టార్గెట్ చేస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వారిని వేధింపులు, అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాంకురాలో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మమతా బెనర్జీ ప్రసంగించారు. టీఎంసీ అభ్యర్థులు ఎవరనేది కాకుండా తన నాయకత్వాన్ని మాత్రమే చూడాలని ఈ సందర్భంగా ఓటర్లను మమతాబెనర్జీ కోరారు. 294 నియోజకవర్గాల్లోనే తననే అభ్యర్థిగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో అవకతలను ప్రధానంగా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ, ఒకేరోజు 30,000 అప్లికేషన్లు దాఖలైనట్టు పార్టీ నేత అభిషేక్ బెనర్జీ వద్ద సమాచారం ఉందని తెలిపారు. బెంగాల్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను బీజేపీ దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. 'బిహార్‌లో చేసినట్టుగానే రైల్వేలను ఉపయోగించుకుని బయట ప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది' అని అన్నారు. భారత ఎన్నికల కమిషన్‌పై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ చెప్పినట్టు ఈసీఐ నడుచుకుంటోందని, బీజేపీ-ఈసీ కలిసి ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులను ఊడలాక్కుంటాయని ఆరోపించారు. ఓటర్ల లిస్ట్‌లో కొందరిని టా÷-గ్గ÷ట్ చేసి తొలగించడం, మరికొందరిని జాబితాలో చేర్చడం జరుగుతోందన్నారు. తప్పుడు ఫారం-6 అప్లికేషన్లతో బీహార్ ఓటర్ల జాబితాలో చేరేందుకు ప్రయత్నించిన పలువురు బీజేపీ కార్యకర్తలు పట్టుబడినట్టు చెప్పారు. ఇది కేవలం ఓటర్ల హైజాకింగ్ కిందకే వస్తుందన్నారు. చట్టబద్ధత కలిగిన 60 లక్షల అప్లికేషన్లు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. బల్క్ ఎంట్రీలను మాత్రం ఫాస్ట్ ట్రాక్ చేస్తున్నారని అన్నారు. ఇదెంతమాత్రం రొటీన్ పక్రియ కాదని, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడంపై జరుగుతున్న దాడి అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో మాంసాహారంపై నిషేధం విధిస్తుందని, దొడ్డిదారిన ఎన్‌ఆర్‌సీ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సాంస్కృతిక ఆంక్షలు, వివాదాస్పద విధానాలు అవలంబిస్తోందని అన్నారు.

# అసోంలో మహిళలకు మూడువేల తాయిలం

- 31 హామీలతో బిజెపి మేనిఫెస్టో విడుదల



గౌహతి, మార్చి 31: త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో మంగళవారం బిజెపి సంకల్ప పాత్ర పేరుతో 31 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ హామీల్లో కీలకంగా ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి), మహిళలకు అరుణోదరు పథకం కింద నెలకు మూడువేల రూపాయల్ని నేరుగా తమ బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం వంటివి ఉన్నాయి. మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మాట్లాడుతూ.. 'అస్సాంని ప్రకాశవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే బిజెపి లక్ష్యంగా పెట్టుకుంది' అని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాల మాదిరిగానే అస్సాంలో కూడా యుసిసిని అమలు చేయడమే బిజెపి అజెండా అన్నారు. అలాగే లవ్ జీహాద్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటాం అని ఆయన అన్నారు. యుసిసిని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల పరిధిలోకి వచ్చే ప్రాంతాల నుంచి మినహాయిస్తామని, గిరిజన వర్గాల్లో దీని అమలు చేయమని ఆయన అన్నారు. రద రహిత అస్సాంను మార్చేందుకు రాబోయే రెండేళ్లలో 18 వేల కోట్లను ఖర్చు చేస్తాం. లక్షపతి దీదీ పథకం కింద 40 లక్షల మంది మహిళలకు 25 వేల రూపాయలు అందిస్తాం. వచ్చే ఐదేళ్లలో రెండు లక్షల జాబ్‌లు ఇస్తాం. ఒక జిల్లా, ఒక కళాశాల, ఒక విశ్వవిద్యాలయం, ఒక ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తాం. అరుణోదరు పథకం కింద ఇస్తున్న రూ. 1250లను పెంచి మహిళలకు 3,000లు అందించడానికి ప్రయత్నిస్తాం అని హిమంతబిశ్వ శర్మ అన్నారు. మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో సిఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సర్బానంద సోనోవాల్, ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు దిలీప్ సైకియా హాజరయ్యారు.

# నలంద ఆలయంలో వద్ద తొక్కిసలాట

### 8మంది మహిళా భక్తులు మృత్యువాత

**పాట్నా, మార్చి 31:** బీహార్‌లోని నలందలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నలందలో ఒక ఆలయం వద్ద తొక్కిసలాట జరిగింది. నలంద జిల్లాలోని శీతలా మాత ఆలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. అందరూ మహిళలే కావడం గమనార్హం. ఈ ఘటనలో మరో 12 మందికి పైగా గాయపడ్డారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకుంది. నలంద జిల్లాలోని బీహార్ షరీఫ్‌కు దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మఘ్రా గ్రామంలోని శీతలాష్టమి ఆలయం వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. చైత్ర మాసంలోని చివరి మంగళవారం కావడంతో, ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు మంగళవారం నాడు ఈ గుడికి వస్తుంటారు. నిర్వహణ లోపం కారణంగానే ఈ తొక్కిసలాట జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పదుల సంఖ్యలో మహిళలు స్పృహ తప్పిపోడిపోయిన దృశ్యాలు కలవరపెడుతున్నాయి. బాగా రద్దీగా ఉ ఒడడంతో అంబులెన్స్‌లు కూడా అక్కడకు చేరుకోవడం ఇబ్బందిగా మారింది. గాయపడిన వారికి స్థానికులు సపర్యలు చేస్తున్నారు. చేతులతో ఎత్తుకుని అంబులెన్స్‌ల వద్దకు తీసుకెళ్తున్నారు.

# కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

### ఎల్డీఎఫ్‌తో బీజేపీ కుమ్మక్కు
### అందుకే శబరిమల ఘటనపై మాట్లాడడం లేదు
### మరోమారు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత



**తిరువనంతపురం, మార్చి 31:** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.



భారీ అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న షాపింగ్ మాల్



కోరుట్లలోని కల్లూర్ రోడ్డులో ఉన్న కూలిన 'ఆనంద్ షాపింగ్ మాల్' షటర్

# అప్పుడు 'కాలింది'! ఇప్పుడు 'కూలింది'!!

## నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిన 'ఆనంద్ షాపింగ్ మాల్' ఘటన

### పైకి పైపై రంగులు.. లోపల బలహీనమైన నిర్మాణం

- కస్టమర్ల ప్రాణాలతో యాజమాన్యం ఆటలు
- అధికారుల 'రీ-పర్మిషన్ల'పై జనాల ప్రశ్నలు
- 'భద్రతా ప్రమాణాల'పై తీవ్ర అనుమానాలు
- యాజమాన్యానికి.. అధికారులకు.. 'ముల్లెలపై ఉన్న యావ' కస్టమర్ల సేఫ్టీ పై ఏదని ప్రజాగ్రహం

కాలిపోక ముందు షాపింగ్ మాల్





'మావి కాని ప్రాణాలు.. పోతేనేం.. ఉంటేనేం'.. అన్నట్టు ప్రవర్తిస్తున్నట్టుంది ఆ 'షాపింగ్ మాల్' యాజమాన్యం.. ప్రవర్తన! ఇక వారిచ్చే డబ్బు మూటలకు కాచుక్కూచునే కుక్కల మాదిరి అధికారుల మనస్తత్వం.! నాణ్యత ప్రమాణాలు గంగలో కలిపేసి.. నా జేబులు నిండితే చాలు అనుకుంటూ.. 'చూసీ చూడకుండా వదిలేయడం'తో ఏ క్షణాన కూలిపోతుందోనని.. దాన్ని చూసిన ప్రతీ వారికి వచ్చే డౌట్.! అలా అనుకున్న వారందరి డౌట్.. మంగళవారం రుజువైంది.! గతంలో భారీ అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన భవనాన్ని కూల్చకుండా కేవలం పైపై మెరుగులతో 'జిగేల్' మనే మెరుపులతో తిరిగి ప్రారంభించిన కోరుట్ల పట్టణంలోని ఆనంద్ షాపింగ్ మాల్‌లో మరోసారి ప్రమాద ఘంటికలు మోగాయి. ఉన్నట్టుండి భారీ శబ్దంతో మధ్య షెట్టర్ కూలిపోవడంతో ప్రాణనష్టం తృటిలో తప్పినా, భవన నిర్మాణ భద్రత, అధికారుల నిర్లక్ష్యం, యాజమాన్యం నిర్లక్ష్యవైఖరి అన్నీ కలిసి ప్రజలలో తీవ్ర ఆందోళన రేకెత్తించింది. ఈ ప్రమాద ఘటన కోరుట్లలో చర్చానీయాంశమైంది.!"

- నేటి సాక్షి, కోరుట్ల(రాధారపు నర్సయ్య)

### ఒక్కసారిగా కూలిన షెట్టర్.. వణికిన కస్టమర్లు!

కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్డులో గల 'ఆనంద్ షాపింగ్ మాల్' మధ్య భాగంలో ఉన్న ప్రధాన షెట్టర్ మంగళవారం ఒక్కసారిగా భారీ శబ్దంతో కుప్పకూలింది. ఆ సమయంలో రోడ్డుపై నడుస్తున్న వారు, వాహనదారులు, అలాగే మాల్ లోపల షాపింగ్ చేస్తున్న కస్టమర్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఏం జరిగిందో అర్థం కాక క్షణాల్లోనే అక్కడి నుంచి పరుగులు తీశారు. కొందరు 'ఊపిరి ఆగిపోయినంత పని అయింది' అంటూ భయంతో వణికిపోయారు. షెట్టర్ కూలిన సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడం వల్ల ప్రాణ నష్టం తప్పింది. అయితే కొన్ని క్షణాల తేడాతో పెద్ద విషాదం జరిగే అవకాశం ఉండేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ఘటనతో మాల్ చుట్టుపక్కల ప్రాంతం మొత్తం కొంతసేపు ఉద్రిక్తంగా మారింది.

### గతంలో కాలిన భవనం కూల్చకుండానే..

ఇదే ఆనంద్ షాపింగ్ మాల్ గతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్ని ప్రమాదానికి గురైంది. ఆ ఘటనలో మాల్ లోపల ఉన్న బట్టలు, ఫర్నీచర్, ఎలక్ట్రికల్ సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్ని ప్రభావంతో భవనంలోని సిమెంట్ పిల్లర్లు, ఇనుము నిర్మాణ భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 'నిర్మాణ నిపుణుల' ప్రకారం ఇలాంటి పరిస్థితుల్లో భవనాన్ని పూర్తిగా కూల్చి కొత్తగా నిర్మించాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ అలా చేయకుండా, కేవలం కాలిపోయిన వస్తువులను తొలగించి, పైపైగా మరమ్మతులు చేసి, లోపల-వెలుపల రంగు పూత వేసి తిరిగి ప్రారంభించారు. యధేచ్ఛగా వ్యాపారం చేసుకుంటూ లక్షలు గడించే పనిలోపడ్డారు. ఈ నిర్ణయం అప్పటి నుంచే అనుమానాలకు తావిచ్చింది.



అగ్ని ప్రమాదం తర్వాత పైపై పూతలతో నిర్మాణం

అగ్నిప్రమాదం జరిగిన మర్నాటి దృశ్యం



### పైకి పైపై మెరుగులు.. లోపల ప్రమాద సూచనలు

'షాపింగ్ మాల్'ను తిరిగి ప్రారంభించిన తర్వాత బయటకు చూస్తే కొత్త భవనం లాగా మెరుస్తోంది. లైటింగ్, పెయింటింగ్, ఇంటీరియర్ డెకరేషన్ అన్నీ ఆకర్షణీయంగానే కనిపిస్తున్నాయి. కానీ.. లోపల అసలు 'పిల్లర్ల' లోపల నిర్మాణ బలం ఎంత ఉందన్నది ఎవరూ పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలిపోయిన తర్వాత బలహీనపడ్డ సిమెంట్, స్టీల్‌పై సరైన పరీక్షలు లేకుండానే మాల్‌ను తిరిగి ప్రారంభించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో షెట్టర్ కూలిన ఘటన, భవనంలో ఉన్న లోపాలను బహిర్గతం చేసినట్టు కనిపిస్తోంది.

### లాభాల కోసం భద్రతను గాలికి వదిలేశారా?

యాజమాన్యం కస్టమర్ల భద్రత కంటే లాభాలకే ప్రాధాన్యం ఇచ్చిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, భవన నిర్మాణ భద్రత వంటి కీలక అంశాలను పూర్తిగా పక్కనపెట్టి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా ప్రమాదం మళ్లీ జరిగితే..'పోయే ప్రాణాలు మావి కాదుగా... డబ్బు సంపాదించడమే మాకు ముఖ్యం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని..' స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైపై అలంకరణలతో కస్టమర్లను ఆకర్షిస్తూ, లోపల ప్రమాదకర పరిస్థితులను దాచిపెట్టారని వారు ఆరోపిస్తున్నారు. షాపింగ్ సమయంలో 'ఔనూ.. చూస్తే కొత్తగా కలర్ ఫుల్'గానే కనిపిస్తోంది.. ఏదైనా జరిగి కూలిపోతే..' ముందు ఈ ముచ్చట పెట్టుకున్నాకే..బట్టల షాపింగ్ చేస్తుంటారని కస్టమర్లు చెప్పుకుంటుండడం గమనార్హం.!

### మున్సిపల్ అధికారుల పాత్రపై ప్రశ్నలు!

ఈ ఘటనతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్, ఫైర్ సేఫ్టీ అధికారులపై కూడా తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్ని ప్రమాదం తర్వాత పూర్తి స్థాయి సేఫ్టీ ఆడిట్ లేకుండానే మాల్‌కు అనుమతులు ఎలా ఇచ్చారన్న ప్రశ్నలకు సమాధానం లేదు. కేవలం కాగితాలపై అనుమతులు ఇచ్చి, వాస్తవ పరిస్థితులను పరిశీలించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. 'అధికారులు తమకు ముట్టే ముల్లెలను కాదని.. తమ బాధ్యతను నిర్వర్తించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాద'ని కస్టమర్లు చెబుతున్నారు.

### భయాందోళనలో కస్టమర్లు

అనుకున్నదే జరిగింది.! బతికుంటే బజార్లో కొనుక్కోగలం 'మళ్లీ వస్తమా.?' ఈ అనుమానపు షాపింగ్ మాల్ కి..అంటూ 'షెట్టర్ కూలిన' ఘటనతో మాల్‌లో ఉన్న కస్టమర్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. 'ఇలాంటి అభద్రపు షాపు'కు రావడమే తప్పు! ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత వహిస్తారు? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోవడం విశేషం. 'ఈరోజు షెట్టర్ కూలింది.. రేపు మొత్తం భవనమే కూలిపోతే'.. పరిస్థితి ఏంటి? అన్న భయం ప్రతి ఒక్కరిలో కనిపించింది. ఈ ఘటన తర్వాత మాల్‌కు రావాలా? వద్దా? అన్న సందేహంలో కస్టమర్లు ఉన్నారు.

### ప్రమాదం జరిగిన తర్వాతే చర్యలా?

ఇలాంటి ఘటనలు జరిగిన తర్వాత మాత్రమే అధికారులు స్పందించడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మేల్కొని, ఇలాంటి భవనాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి, భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం వహించిన యాజమాన్యం, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే 'షాపింగ్ మాల్'ను తాత్కాలికంగా మూసివేసి పూర్తిస్థాయి భద్రతా పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే తిరిగి ప్రారంభించాలని సూచిస్తున్నారు. 'అప్పుడు కాలింది.. ఇప్పుడు కూలింది'.. అనే వాస్తవం కోరుట్లలో ప్రమాద ఘంటికలా మారింది. ఇలాంటి సంఘటనలను చిన్నచూపు చూడకుండా వెంటనే చర్యలు తీసుకోకపోతే, రేపటి ప్రమాదం మరింత తీవ్రమై అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకునే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ఎలాంటి చర్యలు చేపట్టకపోతే 'అధికారులు-యజమానులు' కుమ్మక్కైనట్టేనని కోరుట్ల ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు. చూడాలి ఎవరి బాధ్యత ఎంతో ఉందో స్పష్టమవుతుంది!






ఇటీవలే పునఃప్రారంభం అయిన షాపింగ్ మాల్

షటర్ కూలడంతో మూసి ఉన్న 'ఆనంద్ షాపింగ్ మాల్'









# ఏప్రిల్ 'ఫూల్' కాదు ఏప్రిల్ 'కూల్'


## ఇవాళ ఆల్ 'ఫూల్స్ డే'

'ఫూల్స్-డే' అంటే.! ఏప్రిల్ ఒకటవ తేదీన ప్రపంచ వ్యాప్తంగా సరదాగా జరుపుకునే ఒక పండగ. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆటపట్టించుకోవడం.. గాలి వార్తలు ప్రచారం చెయ్యడం దీని ప్రత్యేకత. దీని బాధితులని 'ఏప్రిల్ ఫూల్స్' గా వ్యవహరించడం పరిపాటి.అప్పట్లో కొన్ని వార్తా పత్రికలు..మ్యాగజైన్లు.. వారపత్రికలు కూడా ఒక్కోసారి అసత్య కథనాలను ప్రచారం చేస్తూ ఉండేవి. మళ్ళీ మరుసటి రోజు ఎక్కడో మూలన 'చిన్న బాక్స్'లో 'ఏప్రిల్ ఫూల్' అంటూ ఫన్నీగా వివరణ ఇచ్చేవారు. 19 వ శతాబ్దం నుంచి బాగా ప్రాచుర్యం లోకి వచ్చిన ఈ 'ఫూల్స్ డే' ఏ దేశంలోనూ 'సెలవు దినం' కాదు.ఇక ఇండియా లోని 'తెలంగాణ-ఆంధ్రప్రదేశ్' రాష్ట్రాల్లో నైతే ఒకర్నొకరు సరదాగా 'ఎప్రిల్ ఫూల్.. ఏప్రిల్ ఫూల్' అంటూ ఇప్పటికీ ఆటపట్టిస్తూ ఉంటారు.!

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

- నాడు చిలిపి పనుల కోసమే 'ఏప్రిల్-ఫస్ట్'
- నేడు 'ఎవ్రీ డే - ఫూల్స్ డే' నే
- అప్పట్లో 'దిన-వార' పత్రికల్లో అసత్య వార్తలతో 'ఏప్రిల్ ఫూల్' డే సెలబ్రేట్
- ఇప్పట్లో 'సోషల్ మీడియా' వేదికగా 'మీమ్స్-ట్రోల్స్'



### ఫుల్లీ లోడెడ్ ఫూల్స్.!

ప్రపంచం అనేది 'ఫుల్లీ ఫూల్స్' తో నిండి ఉంటుంది అనేది జగమెరిగిన సత్యం.! ఒక బాస్ అనుకుంటూ ఉంటాడు...'నాకే అంతా తెలుసు' అన్నట్టుగా తన క్రిందివాళ్ళని మభ్యపెడుతూ ఫూల్స్ చేస్తున్నాను అని! అలానే క్రిందివాడు కూడా అనుకుంటాడు 'బాగా కష్టపడ్డట్టు' నటిస్తూ బాస్లని ఫూల్స్ ని చేస్తున్నా కదా అనుకుంటూ.! అంతెందుకు మన ప్రధానమంత్రే అనుకుంటాడు... జనాలు ఎంత వెర్రి ఫూల్సో కదా...ఫలానా 'పొలిటికల్ సైన్స్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను' అని అనగానే జనాలు నమ్మేశారు అనుకుంటూ.! అలానే జనాలు అనుకుంటూ ఉంటారు..

ఏమనంటే 'ప్రధానిగా మోడీని ఎన్నుకోకపోతే' పొరుగు దేశాల ప్రజల ముందు మనం ఎంత ఫూల్స్ ఐపోయేవాళ్లం అని.! 'అమెరికా' ప్రపంచాన్ని ఫూల్ గా చూస్తుంది.. అలానే 'చైనా' అమెరికాని... 'రష్యా' ఉక్రెయిన్ని.. 'ఇండియా.. పాకిస్తాన్' ని.. ఇలా చెప్పుకుంటూ పోతుంటే ఒకరు ఇంకొకరిని ఫూల్ గా చూస్తూనే ఉంటారు.! కాబట్టి 'వెధవాయితనం' అన్నిచోట్లా ఉంటుంది. అలాంటి వెదవాయిల కోసం జరుపుకునే పండగ రోజే 'ఏప్రిల్ - ఫస్ట్'.. అన్నట్టు.!

### దాదాపు అందరి చిన్నప్పుడూ..

దాదాపు అందరి చిన్నప్పుడూ.. 'ఏప్రిల్ ఫూల్' చేయడమో.. కావడమో కచ్చితంగా జరిగే ఉంటుంది. అరె.. నీ నెత్తిమీద బల్లి పడిందనో..? చీమలు పాకుతున్నాయనో..? నీ డ్రెస్ కు ఏదో అంటిందనో..? ఇలా సడెన్ గా ఏదో విషయం చెప్పి..అవతలి వారు చూసుకుంటే 'ఏప్రిల్ ఫూల్'.. ఏప్రిల్ ఫూల్' అని సంబరపడిపోయే వారు.!

### 'మీమ్స్ అండ్ ట్రోల్స్

ఇక నిన్నటి తరం వాళ్లు 'సోషల్ మీడియా'వేదికగా 'మీమ్స్ అండ్ ట్రోల్స్'తో ఎవ్రీ డే.. ఏప్రిల్ ఫూల్ లను చేస్తూ 'శునకానందం' పొందుతూనే ఉన్నారు.! ఒకదశలో 'మీమ్స్' శృతిమించి పరస్పరం భౌతిక దాడులు.. పోలీసు కేసులు..పరువు నష్టం పేరిట కోర్టు మెట్లెక్కే వరకు దారి తీస్తున్నాయి.







### రేపటి తరానికి 'ఏఐ' వచ్చేసింది

తరానికోసారి 'ఏప్రిల్ ఫూల్'డే ను చిలిపి పనులకోసమే వాడుకుంటుండగా..అది వికృత చేష్టల కోసం రూపాంతరం చెందుతోంది.! ఇదంతా పక్కనబెడితే.. మనల్ని ఎవరో పనిగట్టుకుని 'ఫూల్స్'ను చేయాల్సిన అవసరం లేకుండా 'అరచేతి'లో వైకుంఠం చూపిస్తోన్న 'చరవాణి'యే రోజులో గంటలకొద్దీ 'ఫూల్స్'ను చేసేస్తోంది. 'కన్ఫ్యూజన్' ఫోటోలతో.. అయోమయానికి గురిచేసే 'ట్రిక్' ఫోటోగ్రఫీ.. 'ఏఐ' క్రియేటివ్ డిజైనింగ్ లతో మతి పోగొడుతూ.. 'ఏప్రిల్ ఫూల్' కాదు.. 'ఎవ్రీ టైం ఫూల్'గా మార్చేసింది అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.! ఏది ఏమైనా.. నిన్నటి తరపు ఓ సోషల్ మీడియా 'సూక్తి బాబాజీ' ముక్తాయించినట్టు.. "ఎదుటివారిని..ఏప్రిల్ ఫూల్ చేస్తే ఏమొస్తుంది.? ఇంటికో మొక్క నాటండి .. ఏప్రిల్ కూల్' అవుతుందీ.." అని సో.. ఇది.. బెటరేమో కదా? అందుకే అందరికీ 'ఏప్రిల్ కూల్-డే' చెబుతోంది 'నేటి సాక్షి'!



# పారా ఆర్చర్ ఆఫ్ ది ఇయర్‌గా శీతల్

**ఢిల్లీ :** భారత యువ పారా ఆర్చర్ శీతల్ దేవీకి అరుదైన గుర్తింపు దక్కింది. 19 ఏండ్ల ఈ జమ్మూకశ్మీర్ అమ్మాయి 2025 సంవత్సరానికి గాను 'పారా ఆర్చర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైనట్టు వరల్డ్ ఆర్చరీ ప్రకటించింది. నిరుడు గ్వాంగ్జూలో జరిగిన వరల్డ్ పారా ఆర్చరీ చాంపియన్‌సిప్‌లో స్వర్ణం గెలిచిన మొదటి మహిళా ఆర్మ్‌లెస్ (చేతుల్లేని) ఆర్చర్‌గా రికార్డులకెక్కిన ఆమె నిలకడగా రాణిస్తుండటంతో వరల్డ్ ఆర్చరీ శీతల్‌కు ఈ అవార్డును ప్రకటించింది. వరల్డ్ చాంపియన్‌లో స్వర్ణమే గాక శీతల్.. పారిస్ పారాలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం, వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లోనే మహిళల టీమ్ సిల్వర్, మిక్స్‌డ్ టీమ్ కాంస్యంతో సత్తాచాటింది. ఇక 'ఆర్చర్ ఆఫ్ ది ఇయర్'గా టర్కీకి చెందిన ఎమిర్కన్ హేనీ ఎంపికైంది.



# ప్రీతి, దీపక్ శుభారంభం

**ఢిల్లీ :** సోమవారం నుంచి మంగోలియాలో ప్రారంభమైన ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత బాక్సర్లు శుభారంభం చేశారు. యువ బాక్సర్ ప్రీతి పవార్‌తో పాటు దీపక్ తొలి రౌండ్ బౌట్‌లో తమ ప్రత్యర్థులను చిత్తుచేసి విజయాలతో రెండో రౌండ్‌కు ముందంజవేశారు. మహిళల 54 కిలోల విభాగంలో ప్రీతి.. 5-0తో కజకిస్థాన్ బాక్సర్ ఎలీనా బజరొవను చిత్తుచేసి ఏకపక్ష విజయం సాధించింది. పురుషుల 70 కిలోల విభాగంలో దీపక్.. 3-2తో ఖవస్బెక్ అసదుల్లేవ్ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించాడు.





# టైటాన్స్‌పై పంజాబ్!

## అరంగేట్రంలోనే అదరగొట్టిన కూపర్..

### ఆఖరి వరకు ఉత్కంఠ.. మూడు వికెట్ల తేడాతో గెలుపు..





**పంజాబ్, మార్చి 31:** మొదటి వికెట్ త్వరగా పడింది.. ఆ తర్వాత కాసేపటికే కీలక బ్యాటర్లు పెవిలియన్ చేరారు. లక్ష్యం కష్టంగా మారి ఓటమి తప్పదనుకున్నారంతా! కానీ ఆ అరంగేట్ర కుర్రాడికి మాత్రం అదొక్కటే ఇష్టం లేదు. గుజరాత్ బౌలర్ల పాలిట సింహస్వప్నంలా మారి.. ఒంటరి పోరాటంతో పంజాబ్ కింగ్స్ కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. మంగళవారం రాత్రి ముల్లన్‌పూర్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో గుజరాత్ టైటాన్స్ పై పంజాబ్ కింగ్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది.

#### రాణించిన గిల్.. బట్లర్..

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (39).. జోస్ బట్లర్ (39 నాటౌట్) రాణించారు. గ్లెన్ ఫిలిప్స్ (25) కాసేపు మెరుపులు మెరిపించాడు. పంజాబ్ బౌలర్లలో విజయ్ కుమార్ వైశాఖ్ తన అద్భుత బౌలింగ్ తో మూడు వికెట్లు తీసి గుజరాత్ ను గట్టి దెబ్బకొట్టాడు. యజువేంద్ర చాహల్ రెండు వికెట్లు పడగొట్టగా.. మార్కో జాన్సెన్ కు ఒక వికెట్ దక్కింది.

#### కూపర్ శివతాండవం.. ప్రసిద్ధ్ బౌలింగ్ మాయ

163 పరుగుల లక్ష్య ఛేదనలో పంజాబ్ కింగ్స్ జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య కేవలం ఏడు పరుగులకే వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన ప్రభ్‌సిమ్రన్ సింగ్ (37).. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (18) స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. అయితే గుజరాత్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ వరుస వికెట్లతో పంజాబ్ ను వణికించాడు. నేహల్ వధేరా (3).. శశాంక్ సింగ్ (4).. స్టొయినిస్ (0) తీవ్రంగా నిరాశపరిచారు.సరిగ్గా అప్పుడే క్రీజులో పాతుకుపోయిన కూపర్ కొన్నోలీ గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 44 బంతుల్లోనే ఐదు ఫోర్లు.. ఐదు భారీ సిక్సర్లతో 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జాన్సెన్ తొమ్మిది పరుగులు చేసి అవుట్ కాగా.. చివర్లో జేవియర్ బార్ట్‌లెట్ కేవలం ఐదు బంతుల్లోనే పదకొండు పరుగులు చేసి అతనికి అండగా నిలిచాడు. దీంతో మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ కింగ్స్ ఏడు వికెట్లు కోల్పోయి 165 పరుగులు సాధించి లక్ష్యాన్ని చేరుకుంది. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీయగా.. రషీద్ ఖాన్.. వాషింగ్టన్ సుందర్.. అశోక్ శర్మ.. కగిసో రబడ తలా ఒక వికెట్ పడగొట్టారు. మహ్మద్ సిరాజ్ రెండు ఓవర్లలో పదిహేను పరుగులు ఇచ్చి వికెట్లేమీ తీయలేకపోయాడు.







# అయ్యో పాపం..

### ఐపీఎల్ చరిత్రలో అత్యంత నిలకడైన ఆటగాడు సంజు శాంసన్

### సంజు ఖాతాలో చెత్త రికార్డు.. సంజుకు సీఎస్‌కే కలిసి రాలేదా?

**ఢిల్లీ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత నిలకడైన ఆటగాడిగా పేరు తెచ్చుకున్న టీమిండియా కీపర్ సంజు శాంసన్.. ఐపీఎల్ 2026 వేలానికి ముందు ట్రేడ్ డీల్ ద్వారా రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) నుంచి చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)లోకి చేరాడు. అయితే కొత్త జట్టు సీఎస్‌కేతో ఆరంభం అతడికి కలిసి రాలేదు. తన మాజీ జట్టు రాయల్స్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో సంజు కేవలం 6 పరుగులకే పెవిలియన్ చేరారు. ఆర్ఆర్ బౌలర్ నాంద్రే బర్గర్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్ చివరి బంతికి క్లీన్ బౌల్డ్ అయి అభిమానులను నిరాశకు గురిచేశాడు. దాంతో సంజు ఓ చెత్త రికార్డును ఖాతాలో వేసున్నాడు.

2020 నుంచి 2025 వరకు ప్రతి ఐపీఎల్ సీజన్ తొలి మ్యాచ్‌లలో సంజు శాంసన్ అద్భుతంగా ఆడాడు. ప్రతి మ్యాచ్‌లో అర్ధ శతకం లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేస్తూ ఒక అరుదైన రికార్డును కొనసాగించాడు. కానీ ఐపీఎల్ 2026 మొదటి మ్యాచ్‌లో 6 పరుగులకే అవుట్ అవ్వడంతో ఆ రికార్డుకు తెరపడింది. 2020లో సీఎస్‌కేపై 74 పరుగులు, 2021లో పంజాబ్ కింగ్స్‌పై 119 పరుగులు, 2022లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 55 పరుగులు, 2023లో మరోసారి సన్‌రైజర్స్‌పై 55 పరుగులు, 2024లో లక్నో సూపర్ జెయింట్స్‌పై 82 నాటౌట్, 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 66 పరుగులు చేశాడు.

ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు సంజును రూ.18 కోట్ల భారీ మొత్తానికి సీఎస్‌కే కొనుగోలు చేసింది. యెల్లో జెర్సీలో అతడు ఎలా ఆడతాడో అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అంతేకాదు 2026 టీ20 వరల్డ్ కప్‌లో




అద్భుత ప్రదర్శన చేసిన సంజుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కానీ తొలి మ్యాచ్‌లోనే తక్కువ స్కోర్ చేయడంతో అభిమానులు నిరాశ చెందారు. తొలి మ్యాచ్‌లోనే సంజు విఫలం కావడంతో సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి. 'సంజుకు చెన్నై సూపర్ కింగ్స్ జెర్సీ కలిసి రాలేదా?' అని కొందరు, 'రాజస్థాన్ రాయల్స్‌లోనే సంజు బాగుండేవాడు' అని మరికొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. త్వరలోనే తిరిగి ఫామ్‌లోకి వచ్చి భారీ ఇన్నింగ్స్ ఆడతాడని చెన్నై అభిమానులు ఆశిస్తున్నారు. సంజుకు ఐపీఎల్‌లో మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకు 177 మ్యాచ్‌ల్లో 4704 పరుగులు చేశాడు.

# వరుస సినిమాలో ప్రభాస్ బిజీ

ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ చిత్రపరిశ్రమలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ 'స్పిరిట్', 'ఫౌజీ', 'కల్కి 2' వంటి మూడు భారీ బడ్జెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు 'కల్కి 2' షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా 'సలార్', 'కల్కి 2898', 'ఆదిపురుష్' వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.







## కథనార్‌తో మళ్లీ బలమైన పాత్రలో అనుష్క

### ట్రైలర్ విడుదల చేసిన చిత్రబృందం



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి 'బాహుబలి' తర్వాత సినిమాల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. అడపాదడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఆమె ఇటీవల 'ఘాటీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే ఇప్పుడు భారీ అంచనాల మధ్య మలయాళంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ మూవీ 'కథనార్'తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మాణంలో, దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అనుష్కతో పాటు జయసూర్య, ప్రభుదేవ , సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మలయాళంలో రూపొందుతున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తాజాగా విడుదలైన 'కథనార్' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, సెట్టింగ్స్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రైలర్‌లో అనుష్క కనిపించిన తీరు, ఆమె పాత్రలో ఉన్న గంభీరత, మిస్టరీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే, ఈ సినిమాలో ఫాంటసీ, హారర్, థ్రిల్లర్ అంశాలను మేళవించి రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. 'కథనార్'తో అనుష్క మళ్లీ బలంగా కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## రామాయణ టీజర్ 2న విడుదల

బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. దాదాపు రూ.3000 కోట్ల బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ఈ సినిమా టీజర్‌కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ క్లియరెన్స్ ఇచ్చింది. ఈ చిత్రం నుంచి 'రామ' పేరుతో రాబోతున్న ఈ టీజర్ విడుదలకు ముందు సెన్సార్ బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఏప్రిల్ 2న టీజర్ విడుదల చేయడానికి మార్గం సుగమమైంది. దీనితో పాటు ఈ టీజర్ నిడివికి సంబంధించిన వివరాలు కూడా వెల్లడయ్యాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, 'రామ' టీజర్ రన్‌టైమ్ 2 నిమిషాల 38 సెకన్లుగా ఉంది. ఈ టీజర్‌కు సెన్సార్ బోర్డు యూనివర్సల్ రేటింగ్ ఇచ్చింది, దీంతో ఈ టీజర్‌ను అన్ని వయసుల వారు థియేటర్‌లలో వీక్షించవచ్చు. ఇప్పటివరకు చిత్రబృందం కేవలం టైటిల్ వీడియోతో పాటు 3 నిమిషాల 3 సెకన్ల నిడివి గల 'రామాయణ: ది ఇంట్రడక్షన్' అనే క్లిప్‌ను మాత్రమే పంచుకుంది. భారీ వీఎఫ్ఎక్స్ హంగులతో కూడిన ఆ వీడియోలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, రావణుడిగా కన్నడ స్టార్ యష్ లుక్‌లకు సంబంధించిన ఫస్ట్ లుక్‌లను చూపించారు. అయితే ఇప్పుడు రాబోతున్న టీజర్ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ దృశ్యకావ్యం 2026 నవంబర్‌లో దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.






## విమర్శలను పట్టించుకోవడం మానేశా

### నిర్మాత కొణిదెల నిహారిక

తాను ఏం చేసినా కొందరు విమర్శిస్తూనే ఉన్నారని, అందుకే అలాంటివారిని పట్టించుకోవడం మానేసినట్లు నిర్మాత నిహారిక చెప్పారు. ఆమె సొంత బ్యానర్‌పై వస్తోన్న చిత్రం 'రాకాస' సంగీత్ శోభన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు మానస శర్మ దర్శకురాలు. ఈ మూవీ ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా టీమ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. అందులో నిహారిక మాట్లాడుతూ.. నిర్మాతగా కెరీర్ ప్రారంభించగానే ఎన్నో విమర్శలు ఎదు-రయ్యాయని అన్నారు. కమిటీ కుర్రోళ్లుతో 11 మంది కొత్త వాళ్లను పరిచయం చేశాను. అప్పుడు చాలామంది కామెంట్స్ చేశారు. ఎందుకు చేస్తున్నావు ఇదంతా.. తెలిసిన వాళ్లతో సినిమాలు చేయచ్చు కదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' చేస్తుంటే 'కమిటీ కుర్రోళ్లు' లాంటి కథలు చేయచ్చు కదా.. ఇలాంటి వీఎఫ్ఎక్స్‌లు ఎందుకు అన్నారు. చిన్నచిన్న వాళ్లతో సినిమాలు చేయచ్చు కదా అని మరికొందరు అన్నారు. నేనేం చేసినా మాటలు అనేవాళ్లు అంటూనే ఉన్నారు. అందుకే నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటాను. నిర్మాతగా ప్రతి సినిమా నుంచి నేర్చుకుంటూనే ఉన్నాను. కొణిదెల కుటుంబం నాకు ఎంత ముఖ్యమో నా బ్యానర్ పింక్ ఎలిఫెంట్ ఫ్యామిలీ కూడా అంతే ముఖ్యం అని నిహారిక అన్నారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# వక్ఫ్ భూములపై కబ్జా సామ్రాజ్యం

## అధికారుల అండతోనే దోపిడీ




- గజ్వేల్‌లో 600 ఎకరాల్లో 90 శాతం భూములు మాయం.. అనుమతుల్లేకుండానే నిర్మాణాలు
- మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖల చేతివాటంతోనే యథేచ్ఛగా భూదందా?








**నేటి సాక్షి, గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలో వక్ఫ్ బోర్డు భూములపై కబ్జాదారుల అరాచకం పతాక స్థాయికి చేరింది. సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో దాదాపు 90 శాతం వరకు అక్రమంగా ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా తూప్రాన్ రోడ్, జాలిగామ బైపాస్, దర్గా పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా.. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక భారీ అవినీతి దాగి ఉందని స్థానికులు మండిపడుతున్నారు. ముతాబలీలు లీజు పేరిట భూములను ఇతరులకు అప్పగిస్తూ కోట్ల రూపాయల దందా సాగిస్తున్నారని, వీరికి రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం. వివాదాస్పద భూముల్లో వెలుస్తున్న నిర్మాణాలకు విద్యుత్ శాఖ కనెక్షన్లు ఎలా ఇస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక దర్యాప్తు జరిపించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ కబ్జాలకు సహకరిస్తున్న అధికారులు, నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతున్నారు.

# జయపురంలో 'సివిల్ రైట్స్ డే' అభాసుపాలు



- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- సమయం 11:30 దాటినా కానరాని అధికారులు.. ఖాళీ కుర్చీలతోనే కార్యక్రమం
- గ్రామస్తులకు సమాచారం ఇవ్వని వైనం.. రాజ్యాంగ విలువలను అవమానిస్తున్నారా అని ప్రశ్న

**నేటి సాక్షి,మహబూబాబాద్:** నర్సింహులపేట మండలం జయపురం గ్రామంలో నిర్వహించాల్సిన 'సివిల్ రైట్స్ డే' (పౌర హక్కుల దినోత్సవం) ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. మంగళవారం ఉదయం 11:30 గంటల సమయం దాటిపోయినప్పటికీ, ఒక్క అధికారి కూడా కార్యక్రమ స్థలికి చేరుకోకపోవడం గమనార్హం. అధికారులు లేక, గ్రామస్తులకు కనీస సమాచారం అందక సభా ప్రాంగణమంతా ఖాళీ కుర్చీలతో దర్శనమివ్వడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. పౌర హక్కులు, సామాజిక సమానత్వం మరియు చట్టం ముందు అందరూ సమానులే అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఈ ముఖ్యమైన రోజున, అధికారులే తమ బాధ్యతలను విస్మరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "ఖాళీ కుర్చీలకు అవగాహన కల్పిస్తున్నారా?" అంటూ గ్రామస్తులు అధికారుల తీరును ఎండగట్టారు. ఇలాంటి కీలక కార్యక్రమాలను నామమాత్రంగా నిర్వహించడం ద్వారా సామాజిక న్యాయాన్ని అగౌరవపరుస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జయపురం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# హెడ్ కానిస్టేబుల్ అమృత రావుకు ఘనంగా వీడ్కోలు

- సన్మానించిన ఎస్పీ నితిక పంత్
- 41 ఏళ్ల సుదీర్ఘ సేవలు అభినందనీయం.. ఆదర్శంగా నిలిచారని ప్రశంస
- రూ. 2,68,568 విలువైన పోలీస్ కో-ఆపరేటివ్ చెక్కును అందజేసిన జిల్లా ఎస్పీ



**నేటి సాక్షి, కుమురం భీమ్ ఆసిఫాబాద్ (ఎండి ముబీన్):** పోలీస్ శాఖలో క్రమశిక్షణ, అంకితభావంతో సుదీర్ఘ కాలం సేవలందించి హెడ్ కానిస్టేబుల్ ఆత్రం అమృత రావు అందరికీ ఆదర్శంగా నిలిచారని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ కొనియాడారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం అమృత రావు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీకి సంబంధించిన రూ. 2,68,568 విలువ గల పొదుపు చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 1984లో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన అమృత రావు, 41 సంవత్సరాల పాటు నిరంతర కృషి, అంకితభావంతో పనిచేశారని గుర్తు చేశారు. 2018లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది పెంచికల్పేట్, రెబ్బెన పోలీస్ స్టేషన్లలో సేవలందించారని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన పాత్ర అభినందనీయమని, పదవీ విరమణ తర్వాత కూడా కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చిత్తరంజన్, ఆర్ఐలు అంజన్న, శ్రీనివాస్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజయశంకర్ రెడ్డి, కో-ఆపరేటివ్ సొసైటీ ఇంచార్జ్ జాఫర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న షేక్ అర్బాజ్ హుస్సేన్



**నేటి సాక్షి,కొమురంభీమ్ ఆసిఫాబాద్(ఎండి ముబీన్):** జిల్లా ఆడ కేంద్రానికి చెందిన పీక్కు భాయ్ అనే మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమైన సమయంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ వార్డు నెంబర్ 12 నూర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు షేక్ అర్బాజ్ హుస్సేన్ ముందుకు వచ్చి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇది ఆయనకు మొదటిసారి కాకుండా, ఇంతకు ముందు కూడా అనేక సందర్భాల్లో అవసరమైన వారికి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ షాహిద్ ఆయన సేవాగుణాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సమాజంలో ప్రతి ఒక్కరూ అవసరమైనప్పుడు రక్తదానం చేయాలని సూచించారు.

# మాటలు మోసం.. హామీలు హవా

### ఆశా వర్కర్ల గర్జన ప్రభుత్వానికి అల్టిమేటం!



**నేటి సాక్షి, మునగాల (పాముల రాఘవేందర్):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పుడు గాలిలో కలిసిపోయాయా అంటూ ఆశా వర్కర్లు ప్రభుత్వంపై మండిపడ్డారు. మండల పరిధిలోని రేపాలం గ్రామంలో. పలువురు మాట్లాడుతూ. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన రూ.18,000 ఫిక్స్ వేతనం ఎక్కడ? ఎప్పుడు? అని సూటిగా ప్రశ్నించారు. "ఓటు కోసం ఇచ్చిన మాట అధికారంలోకి వచ్చాక మరచిపోవడం ఎందుకు?" అంటూ ఆశలు ఆగ్రహావేశంతో విరుచుకుపడ్డారు. ఆదేశాలు జారీ చేశామంటూ చెప్పడం కాకుండా, వెంటనే వేతనాలు ఖాతాల్లో పడాలని గట్టిగా డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేకుండా, కనీస గౌరవం లేకుండా పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్, ప్రసూతి సెలవులు వంటి హక్కులు ఇవ్వకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. "మా సహనం పరీక్షించొద్దూ మా పోరాటం ఆగదు!" అంటూ ప్రభుత్వానికి చివరి హెచ్చరిక జారీ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు జి. భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన నిరసన ఆగ్రహ జ్వాలలతో నిండిపోయింది. భారీ సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎం. సుధారాణి, మయూరి, అరుణ, జ్యోతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# నేడు లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం



**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలోని 600 ఏళ్ల పురాతన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఈరోజు సాయంత్రం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 2వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు ఎడ్ల బండ్లతో శకటోత్సవం, శుక్రవారం తెల్లవారుజామున రథోత్సవం జరగనున్నాయని వేద పండితులు మణిశంకర్ శర్మ తెలిపారు. ఈ జాతరకు ఇతర జిల్లాల నుండి కూడా భక్తులు భారీగా తరలివస్తారని ఆలయ ప్రధాన అర్చకులు పరంకుశ యాదగిరి స్వామి, వెంకటనారాయణ, ప్రదీప్ ఆచార్యులు పేర్కొన్నారు. భక్తులందరూ ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# బడ్జెట్ సమావేశం ఉద్రిక్తం



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ (ఎండి ముబీన్):** మున్సిపల్ బడ్జెట్ సమావేశం ఉద్రిక్త వాతావరణంలో జరిగింది. అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన తమను సుమారు గంటసేపు బయట నిలబెట్టారని, ఇది ప్రజాప్రతినిధుల అవమానమని 10 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపించారు. గౌరవం ఇవ్వకుండా వ్యవహరించడంపై కమిషనర్‌ను నిలదీశారు. ఇటీవల రూ. 4 లక్షల వ్యయంతో నిర్మించిన కొత్త గదిలో సరైన సౌకర్యాలు లేవని కూడా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం లేకపోతే పాలన ఎలా కొనసాగుతుందనే ప్రశ్నను లేవనెత్తారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

## గురుకులాల్లో విషాదం..

**విద్యార్థి ఆత్మహత్య ప్రభుత్వ వైఫల్యమే: కంచర్ల రవి గౌడ్**




**నేటి సాక్షి,సిరిసిల్ల (శివకుమార్):** మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని బిఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవి గౌడ్ పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గురుకులాల్లో విద్యార్థుల భద్రతను పర్యవేక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకుల పాఠశాలల్లో సమస్యలు పెరిగాయని, పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి విషాదాలు చోటుచేసుకుంటున్నాయని రవి గౌడ్ విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన గురుకుల వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం బలహీనపరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి తక్షణమే ఆర్థిక పరిహారం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి వినయ్ కుమార్, ఎండి అజ్జు, లింగంపల్లి రామ్ చరణ్, పవన్, జశ్విత్, ఈశ్వర్, కలీం తదితరులు పాల్గొన్నారు.

## కవయిత్రి మంజుల పత్తిపాటికి సత్కారం

**సాహిత్య సేవలకు ప్రశంసా పత్రం ప్రదానం**



**నేటి సాక్షి,కరీంనగర్:** కరీంనగర్‌లో భవానీ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో వెలువడిన 'వందేమాతరం" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ మహిళా నాయకురాలు, సామాజిక కార్యకర్త, కవయిత్రి శ్రీమతి మంజుల పత్తిపాటిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైరాగ్యం ప్రబాకర్ సంపాదకత్వంలో వెలువడిన 'వందేమాతరం' పుస్తకానికి కవిత రచించి పంపి, పుస్తక ప్రచురణలో భాగస్వామ్యమైనందుకు శ్రీమతి మంజుల పత్తిపాటిని ప్రత్యేకంగా అభినందించారు. ఆమె సాహిత్య సేవలను కొనియాడుతూ ప్రశంసా పత్రం అందజేశారు. కరీంనగర్‌లో జరిగిన ఈ కార్యక్రమం సాహిత్యాభిమానులతో కళకళలాడింది. పలువురు కవులు, రచయితలు, సాహిత్య ప్రముఖులు పాల్గొని 'వందేమాతరం' పుస్తక ప్రాధాన్యతను వివరించారు. దేశభక్తి భావాలను ప్రతిబింబించే ఈ పుస్తకానికి మంచి ఆదరణ లభించిందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీమతి మంజుల పత్తిపాటి తనకు లభించిన గౌరవంపై సంతోషం వ్యక్తం చేశారు. తన సాహిత్య కృషిని గుర్తించి సత్కరించిన భవానీ సాహిత్య అకాడమీకి ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా సాహిత్య సేవలను కొనసాగిస్తానని తెలిపారు.

## సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

**క్రైస్తవ దళితులకు రిజర్వేషన్లు నిరాకరించడంపై నల్లబెల్లిలో నిరసన**



**నేటి సాక్షి, నల్లబెల్లి:** క్రైస్తవ మతంలోకి మారిన ఎస్సీలకు రిజర్వేషన్లు వర్తించవని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని దళిత హక్కుల పోరాట సమితి మండల కన్వీనర్ పరికి కోర్నేలు అన్నారు. బుధవారం నల్లబెల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ తీర్పు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను, సమానత్వాన్ని దెబ్బతీసేలా ఉందన్నారు. అగ్రవర్ణాలకు చెందిన వారు క్రైస్తవ మత ప్రచారం చేస్తూ రిజర్వేషన్లు పొందుతున్నారని, కేవలం ఎస్సీల విషయంలోనే వివక్ష చూపడం సరికాదని విమర్శించారు. ఆర్టికల్ 14, 15, 25 ప్రకారం దళితుల హక్కులను కాపాడాలని, హక్కుల సాధన కోసం ఎస్సీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొమ్మకంటి అనిల్, గూడెపు భాస్కర్, కడియాల క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ మున్సిపల్ శోభాయాత్రలు

**జయంతులకు నిధుల మంజూరు**



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ :** కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు కార్యక్రమాలకు నిధుల మంజూరుకు ఆమోదం లభించింది. ఏప్రిల్ 2న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు రూ. 3 లక్షలు, అంబేద్కర్ జయంతికి రూ. 2.56 లక్షలు, ఏప్రిల్ 4న జరగనున్న బాబు జగ్జీవన్ రామ్ జయంతికి రూ. 1 లక్ష మంజూరు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రతిపాదనలు ఉంచగా, కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. అనితతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు వలి, విద్యావతి, బాబురావు, మాణిక్యం, వాసీమ్, రవి, గజ్జి స్వాతి, భాగ్యలక్ష్మి, పోచయ్య, స్వప్న వనమాల రాము, తదితరులు వెల్లడించారు.

# కోటిలింగాల గ్రామ శాఖ అధ్యక్షుడిగా రాపాక సత్తయ్య

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ కమిటీ.. పార్టీ బలోపేతమే లక్ష్యమని వెల్లడి
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని నాయకుల పిలుపు

**నేటి సాక్షి, వెల్గటూర్:** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో భారత రాష్ట్ర సమితి (బీ=రా) గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చల్లూరి రామచంద్రం గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడిగా రాపాక సత్తయ్యను ఎంపిక చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి నిరంకుశంగా పాలిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని, 2029లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, నాయకులు బాలసాని సత్యం, కొప్పుల సురేష్, మూగల సత్యం, రాపాక కోటయ్య, అడ్డగట్ల తిరుపతి, పోరండ్ల శ్రీనివాస్ మరియు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయి దందాపై కోర్టు కఠిన తీర్పు

- ఐదుగురికి 7 ఏళ్ల జైలు శిక్ష
- ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధింపు

గంజాయి సాగు, సరఫరా, విక్రయంపై కఠిన హెచ్చరిక

- నేరాలపై చట్టం ముందు ఎవరూ తప్పించుకోలేరని జగిత్యాల ఎస్పీ స్పష్టం

**నేటి సాక్షి, జగిత్యాల(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లాలో గంజాయి సాగు, సరఫరా చేయడంతో పాటు విక్రయ కార్యకలాపాలకు పాల్పడిన ఐదుగురు నిందితులకు న్యాయస్థానం కఠిన శిక్ష విధించింది. ఈ కేసులో నమోదైన సాక్ష్యాధారాలను సమగ్రంగా పరిశీలించిన 1వ అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి ఎస్. నారాయణ నిందితులందరినీ దోషులుగా నిర్ధారించి ఒక్కొక్కరికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10,000 జరిమానా విధిస్తూ కీలక తీర్పు వెలువరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సోయాం రాజు (40), అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం షాయిపూర్ గ్రామానికి చెందినవాడు. ఇతనితో పాటు పాల రాజ్ కుమార్ (22), బొమ్మిడి సాయి చంద్ (22), బాల నరేష్ (20), కొలుగురి సాయి సృజన్ (22)లు ఈ నేరంలో పాల్గొన్నారు. వీరందరూ గంజాయి సాగు, కొనుగోలు, వినియోగ కార్యకలాపాల్లో భాగస్వాములైనట్లు దర్యాప్తులో తేలింది. కేసు వివరాల ప్రకారం,ఏా1 సోయాం రాజు అధిక డబ్బు సంపాదించాలనే ఆశతో తన పత్తి చేనులో గంజాయి మొక్కలను సాగు చేస్తూ, అవసరమైన వారికి ఫోన్ ద్వారా సంప్రదించి స్వయంగా సరఫరా చేసేవాడు. మిగతా నిందితులు అతని వద్ద నుండి తరచుగా గంజాయి కొనుగోలు చేసి వినియోగించేవారని పోలీసులు గుర్తించారు. 2022 డిసెంబర్ 23న నిందితులు గంజాయి కోసం ప్రధాన నిందితుడిని సంప్రదించగా, నూకపల్లి డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతానికి రావాలని సూచించాడు. ఇదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద సుమారు 1.25 కిలోల (1250 గ్రాములు) ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితులపై నేరం రుజువవడంతో కోర్టు కఠిన శిక్ష విధించింది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, గంజాయి వంటి మత్తు పదార్థాల సాగు, సరఫరా, రవాణా, విక్రయం చట్టవిరుద్ధమే కాక సమాజానికి తీవ్రమైన హానిని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి మల్యాల ఎస్సై చిరంజీవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సయ్య, సిఎంఎస్ ఎస్సై ఎస్. శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ హరీష్, సిఎంఎస్ కానిస్టేబుళ్లు రాజు నాయక్, కిరణ్ కుమార్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# భట్టుపల్లి చౌరస్తా ఇకపై 'కావేటి సమ్మయ్య' చౌరస్తా



- మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం

ఉద్యమకారునికి దక్కిన సముచిత గౌరవం: ఎమ్మెల్సీ దండె విఠల్

- చౌరస్తాలో విగ్రహ ఏర్పాటుకు కూడా కౌన్సిల్ ఆమోదం

**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్:** కాగజ్‌నగర్ పట్టణంలోని భట్టుపల్లి చౌరస్తాకు సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేస్తూ మున్సిపల్ కౌన్సిల్ మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానించింది. 17వ వార్డు కౌన్సిలర్, కావేటి సమ్మయ్య కుమారుడు కావేటి విజయ్ కుమార్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. చౌరస్తాలో సమ్మయ్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని కౌన్సిల్ సభ్యులు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కావేటి సమ్మయ్య పోరాటం మరువలేనిదని కొనియాడారు. అసెంబ్లీపై నల్ల చొక్కాతో ఆయన చేసిన నిరసన ఉద్యమానికి ఊపిరి పోసిందని, అటువంటి గొప్ప నాయకుడిని కాంగ్రెస్ ప్రభుత్వం సముచితంగా గౌరవిస్తోందని పేర్కొన్నారు. తన తండ్రి పేరును చౌరస్తాకు ఖరారు చేసినందుకు కౌన్సిల్ సభ్యులకు, అధికారులకు కావేటి విజయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం పట్ల కాగజ్‌నగర్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా డా. వై. అనూప్ రావు





- కోరుట్లకు దక్కిన గౌరవం

పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన అనూప్ రావు

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కోరుట్లకు చెందిన డా. వై. అనూప్ రావు నియమితులయ్యారు. ఈ నియామకం ద్వారా కోరుట్ల ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు డా. వై. అనూప్ రావును రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ సందర్భంగా పార్టీ పట్ల తన నిబద్ధతను మరింతగా పెంచుకొని పనిచేస్తానని అనూప్ రావు తెలిపారు.ఈ నియామకానికి సహకరించిన నిజామాబాద్ ఎంపీ అరవింద్ కి,జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబుకి డా. అనూప్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు తిరుమల వాసు, రుద్ర సుజాత, కలాల రాధ సాయిచందు, గూగులోతు శ్రీకాంత్, కోరుట్ల మండల అధ్యక్షుడు పంచరీ విజయ్, టౌన్ సెక్రటరీ రాజేందర్, సాగర్, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ లింగారెడ్డి, సుధావేణి మహేష్, గిన్నెల శ్రీకాంత్, బెక్కం అశోక్, మ్యాకల గణేష్, తులసి కృష్ణ, మాజీ కౌన్సిలర్ లు మాడవేణి నరేష్, పెండెం గణేష్, రాగంశెట్టి సాయి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ఉద్యాన వర్సిటీలో 'హార్టి ఇన్నోవేషన్ హబ్'



- అంతర్జాతీయ పరిశోధనలకు వేదిక

యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాతో కలిసి ఉమ్మడి పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు

- ఆధునిక సాంకేతికత, స్టార్టప్‌లకు ప్రోత్సాహమే లక్ష్యం: వీసీ డాక్టర్ దండా రాజి రెడ్డి



**నేటి సాక్షి, గజ్వేల్:** ఉద్యాన రంగంలో అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, అంతర్జాతీయ స్థాయి పరిశోధనలను ప్రోత్సహించేందుకు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో 'హార్టి ఇన్నోవేషన్ హబ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజి రెడ్డి వెల్లడించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా ప్రతినిధులతో కలిసి మంగళవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు. ఈ హబ్ ద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు ప్రపంచ స్థాయి పరిజ్ఞానం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ (GIS), పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ మరియు ప్రత్యేక ఇన్క్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లు, ఉమ్మడి పరిశోధనలు సాగుతాయని అధికారులు తెలిపారు. దీనివల్ల రైతులకు కూడా ఆధునిక సాగు పద్ధతులు చేరువవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. భగవాన్, డీన్ డాక్టర్ జె. చీనా నాయక్, ఏఎస్జీఆర్ఏయూ మాజీ వీసీ డాక్టర్ సుధాకర్ రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా డైరెక్టర్ కె. రమేష్ రెడ్డి మరియు ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతికి పటిష్ట భద్రత



- డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించాలి: ఎస్పీ నితిక పంత్
- నేర సమీక్షా సమావేశంలో పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ కీలక ఆదేశాలు
- గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం.. సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని సూచన

**నేటి సాక్షి, కుమురం భీమ్ ఆసిఫాబాద్ (ఎండి ముబీన్):** రాబోయే హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజల భద్రతే లక్ష్యంగా డయల్ 100 కాల్స్‌కు సిబ్బంది తక్షణమే స్పందించాలని, పెట్రోలింగ్ మరియు బ్లూ కోల్ట్స్ గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరిపి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని ఎస్పీ పేర్కొన్నారు. గంజాయి, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటును వేగవంతం చేయడంతో పాటు, సైబర్ నేరాలు మరియు రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై రాజీలేని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ వాహిదుద్దీన్, ఇన్స్పెక్టర్లు సతీష్, శ్రీధర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో డ్రైవింగ్ 10 ఏళ్ల జైలు శిక్ష

- జగిత్యాల కోర్టు కీలక తీర్పు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరిక

**నేటి సాక్షి, జగిత్యాల(రాధారపు నర్సయ్య):** మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనం నడిపి వ్యక్తి మరణానికి కారణమైన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలో 2013 ఫిబ్రవరి 2న జరిగిన ఈ ఘటనలో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కుంటాల భీరయ్య (40) జాతీయ రహదారి (ఎన్‌హెచ్-61) పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా, వేగంగా వచ్చిన మారుతి సుజుకి వ్యాగనార్ కారు వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భీరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన తర్వాత తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించిన నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితుడు వనం అంజయ్య (53), మంచిర్యాల జిల్లా తిలక్‌నగర్ నివాసి అని గుర్తించారు. అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన దర్యాప్తులో నిందితుడి రక్త నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపగా, మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. సాక్ష్యాలను పరిశీలించిన 1వ అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి నారాయణ నిందితుడిని దోషిగా తేల్చి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీసే చర్య అని హెచ్చరించారు. ఇలాంటి ఘటనల్లో నిందితులకు కఠినమైన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సయ్య, ఎస్.ఐ శ్రీకాంత్, కోర్టు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట





- మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ. 10 వేల కోట్ల లబ్ధి.. ఉచిత బస్సు ప్రయాణంతో పొదుపు
- అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ బలోపేతం.. మహిళా శక్తి భవన్ ప్రారంభానికి సిద్ధం

**నేటి సాక్షి, మంచిర్యాల:** రాష్ట్రంలోని మహిళల సంక్షేమం మరియు వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు సుమారు 10 వేల కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూరిందని, ఈ పొదుపు మొత్తాన్ని వారు కుటుంబ పోషణకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల్లో మహిళలకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కమిటీల్లో మహిళల భాగస్వామ్యం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అభినందించారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన 'ఇందిరా మహిళా శక్తి భవన్' పనులు పూర్తయ్యాయని, ఇది రాష్ట్రంలోనే మొట్టమొదటిదిగా ప్రారంభానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి కోసం 16 బస్సులను ఆర్టీసీకి లీజుకు ఇచ్చే ప్రక్రియ సాగుతోందని, తద్వారా వారికి అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ ధర్ని మధుకర్, డీఆర్‌డీఓ కిషన్, మహిళా సమాఖ్య ప్రతినిధులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకంతో రూ.10,000 కోట్ల ఆదాలి





- మహిళల ఆర్థిక భద్రతకు ఉచిత బస్సు ప్రయాణం పునాది
- జగిత్యాల నూతన బస్టాండ్‌లో కలెక్టర్ సమీక్ష

**నేటి సాక్షి,జగిత్యాల (రాధారపు నర్సయ్య):** మహాలక్ష్మీ పథకం అమలుతో మహిళల ప్రయాణ ఖర్చుల్లో భారీగా ఆదా జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10,000 కోట్ల ఆదాయం ఆదా అయినట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. జగిత్యాల కొత్త బస్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం వల్ల మహిళలు రోజువారీ ఖర్చులను తగ్గించుకుని ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలు, విద్య, ఆరోగ్యంపై వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ప్రయాణించే మహిళలను శాలువాలతో సన్మానించి, బహుమతులు అందజేశారు. కొత్త బస్టాండ్‌లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రమైన, సౌకర్యవంతమైన ప్రయాణ సేవలు అందించేందుకు శాఖల మధ్య సమన్వయం అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

# బావిలో మహిళ మృతదేహం

## మోహన్‌రావుపేటలో విషాద ఘటన

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామంలో ఓ మహిళ మిస్సింగ్ ఘటన విషాదాంతమైంది. పొలం వద్ద ఉన్న బావిలో ఆమె మృతదేహం బయటపడడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. మోహన్ రావు పేట గ్రామానికి చెందిన ఆది గంగ మల్లు (55) మార్చి 29న మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆమె జాడ లభించలేదు. దీంతో అదే రోజు రాత్రి కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు కలిసి గాలింపు చర్యలు చేపట్టగా, మార్చి 30 ఉదయం ఆమె పొలం వద్ద ఉన్న నీటి బావిలో మృతదేహం కనిపించింది. గత నాలుగేళ్లుగా వెన్నెముక డిస్క్ నొప్పితో బాధపడుతున్న ఆది గంగ మల్లు హైదరాబాదులోని అపోలో ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ, ఇటీవల మళ్లీ తీవ్ర నొప్పితో ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో మానసికంగా కలత చెంది బావిలో పడిపోయి మృతి చెందినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

# అకాల వర్షాలతో అన్నదాతకు నష్టం



**నేటి సాక్షి,మేడిపల్లి:** భీమారం మండలం మన్నెగూడెంలో అకాల వర్షంతో తీవ్ర నష్టం జరిగింది. చేతికి అందిన వరి, నువ్వుల పంట నేలపాలు అయ్యింది. మామిడి కాయలు రాలిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. భీమారం ఏవో కీర్తి కుమారి, క్లస్టర్ ఏఈఓ సురేందర్ నాయక్ పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని, రైతులకు న్యాయం జరిగేవిదంగా చూస్తామని తెలపడం జరిగింది. ఇట్టి పర్యాటలో వల్లంపల్లి సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు గోపిడి మహిపాల్ రెడ్డి, తిప్పిరెడ్డి రాజారెడ్డి, జలంధర్ రెడ్డి, రాజారెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పూలే జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి



**నేటి సాక్షి,చిలుకూరు:** భారతీయ సామాజిక సంస్కర్త, మహిళా విద్యా పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఏప్రిల్ 11న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బహుజన వేదిక రాష్ట్ర కన్వీనర్ కస్తూరి రాములు కోరారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, బహుజనుల హక్కుల కోసం పూలే చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సైతం తన గురువుగా, మహాత్మాగా గుర్తించిన పూలే.. నాటి మనువాద సిద్ధాంతాలను ఎదిరించిన గొప్ప యోధుడు అని రాములు పేర్కొన్నారు. బహుజన పితామహుడిగా కీర్తించబడే పూలే ఆశయాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని, ఆయన జయంతి వేడుకలను ప్రభుత్వమే బాధ్యతగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బహుజన వేదిక నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# బండ ప్రకాష్‌కు సన్మానం



**నేటి సాక్షి నారాయణపేట (ఇమామ్ సాబ్):** శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నీరటి నరసింహులు నాయుడు ముదిరాజ్, పెద్ద విజయ్ మార్కెట్ వైస్ చైర్మన్ గారు గౌని శ్రీనివాస్,. ఎంపిటిసి, పటేల్ శ్రీనివాస్, నీరటి శివకుమార్ జి రాములు సి కురుమూర్తి పి అనిల్ కుమార్ ఎం రామచంద్రయ్య ఎస్ బాలచందర్ జి రఘు ఎన్ భాను పి వెంకటేష్ తదితరులు పాల్గొని శాసనమండలి చైర్మన్ గారికి తెలంగాణ ముదిరాజ్ తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండ ప్రకాష్ గారిని శాల్వా పూల బొకేతో సత్కరించడం జరిగింది.

# ముగిససిన మల్లన్న జాతర

## బుల్కాపురం గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు



**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురం శివారులో మూడు రోజులుగా జరిగిన మల్లన్న జాతర శాంతియుతంగా జరిగినందుకు బుల్కాపురం ఐదవ వార్డు కౌన్సిలర్ భానూరి కృష్ణ మల్లన్న భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లు జరగకుండా యువకులు, పెద్దలు సహకరించారని అభినందనలు తెలిపారు. కాగా మూడు రోజులపాటు శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణం, కామరాతి బీరప్ప స్వామి కళ్యాణం, కొండపోచమ్మ జాతరలు జరిగాయి.

# ఏఎస్ఐ చంద్రయ్యకువీడ్కోలు

### సన్మానించిన ఎస్పీ స్నేహ మెహ్రా




**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా మహిళా పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన జి. చంద్రయ్యను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా హాజరై, చంద్రయ్యను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 38 సంవత్సరాల పాటు ఎలాంటి రిమార్క్ లేకుండా, నిష్కళంకమైన సేవలు అందించిన చంద్రయ్య కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ వేడుకలో డీఎస్పీ వీరేష్, ఇన్స్పెక్టర్ సరోజా, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గంగమ్మ ఆలయ వేలం పాట

### రూ. 97.97 లక్షల ఆదాయం

**నేటి సాక్షి, చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలంలోని దిగువపల్లి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానంలో 2026-27 సంవత్సరానికి గాను వివిధ సేవల నిర్వహణ హక్కుల కోసం మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా దేవస్థానానికి మొత్తం రూ. 97,97,000 ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. కొండపై పూల హారాలు, నిమ్మకాయలు, వడిబాల సామాగ్రి విక్రయించే హక్కును పి. రెడ్డెప్ప రూ. 32.70 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే, కొండపై ఉన్న నాలుగు దుకాణాల్లో పవిత్ర దారాలు, బొమ్మలు, ఫోటోలు విక్రయించే హక్కులను సి. రమణ (రూ. 14.20 లక్షలు), ఇ. నవీన్ (రూ. 14.10 లక్షలు), జి. రెడ్డెప్ప (రూ. 14.19 లక్షలు), పి. కదిరప్ప (రూ. 14.40 లక్షలు) హెచ్చు పాటదారులుగా నిలిచి దక్కించుకున్నారు. కొండ కింద తాత్కాలిక అంగళ్ల హక్కును జె. హరిబాబు రూ. 1.33 లక్షలకు, డార్మిటరీ హాళ్ల నిర్వహణ హక్కును సి. కిరణ్ కుమార్ నాయుడు రూ. 7.05 లక్షలకు పాడుకున్నారు. ఈ వేలం పాటలు పారదర్శకంగా జరిగాయని ఆలయ వర్గాలు తెలిపాయి.

# కాగతిలో దారి మూసివేత

### రెవెన్యూ అధికారుల అండతోనే ఇష్టారాజ్యం



**నేటి సాక్షి, చౌడేపల్లి:** చౌడేపల్లి మండలం కాగతి గ్రామ పంచాయతీ పరిధిలో తరతరాలుగా ఉన్న దారిని గత ప్రభుత్వ హయాంలో కొందరు రాజకీయ నాయకులు రెవెన్యూ అధికారుల అండతో మూసివేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగతి నుండి యనమసామనపల్లికి వెళ్లే మార్గంలో శ్రీవాణి షుగర్ ఫ్యాక్టరీ వరకు ఉన్న సుమారు 15 అడుగుల దారిని మూసివేసి, నిబంధనలకు విరుద్ధంగా చెరువులో దారిని ఏర్పాటు చేశారని ఆరోపిస్తున్నారు. గతంలో పశువుల కాపరులు, రైతులు చెరుకు బండ్ల కోసం ఇదే దారిని వినియోగించేవారని, ప్రస్తుతం బడుగు బలహీన వర్గాల భూములను కొందరు అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ భూముల వివరాలు, అసైన్మెంట్ రద్దు నోటీసులపై సమాచార హక్కు చట్టం (RTI) కింద దరఖాస్తు చేసి 40 రోజులు గడుస్తున్నా.. గ్రామ రెవెన్యూ అధికారిణి (VRO) సమాచారం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని బాధితులు మండిపడుతున్నారు. వివరణ అడిగితే దారిని మూసివేసిన వారితోనే చెబుతానని బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో ఏర్పాటు చేసిన అక్రమ దారిని తొలగించాలని తహశీల్దార్ ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పాత దారిని పునరుద్ధరించాలని మరియు అసలు పట్టాదారులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# పౌర హక్కుల దినోత్సవం..

### శానబండలో అవగాహన కార్యక్రమం



**నేటి సాక్షి, ఎండపల్లి:** సమాజంలో నెలకొన్న అంటరానితనం నిర్మూలనపై ప్రతి నెల చివరి రోజు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పౌర హక్కుల దినోత్సవంను మంగళవారం శానబండ గ్రామంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఐ అన్వేష్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని, రాజ్యాంగం అందించిన హక్కులు ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తిస్తాయని వాటి పరిరక్షణలో ప్రజల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. పౌర హక్కుల సాధనకు చైతన్యం అవసరమని ఆయన స్పష్టం చేశారు. అలాగే గ్రామ సర్పంచ్ గాదం భాస్కర్ మాట్లాడుతూ, పౌర హక్కులపై అవగాహన పెరగడం వల్ల సమాజంలో సమానత్వం, న్యాయం స్థిరపడతాయని, అంటరానితనం నిర్మూలనలో గ్రామస్థులు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్, ఎస్సీ బాలుర వసతి గృహ అధికారి యం.డి అఫ్సర్, ఏఈవో సందీప్, ఉప సర్పంచ్ కడారి రజిత, వార్డు సభ్యులు సత్తయ్య, సత్యనారాయణ, శంకరమ్మ, శంకరయ్య, కార్యదర్శి మారుతీ, పలు శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నైపుణ్యాల పెంపుపై దృష్టి




- ఎన్‌జీఓలు-అభివృద్ధి రంగంపై అవగాహన కార్యక్రమం విజయవంతం
- ఎస్‌కేఎన్ఆర్ కళాశాలలో రెండు రోజుల అకడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు

**నేటి సాక్షిజగిత్యాల (రాధారపు) నర్సయ్య):** జగిత్యాల ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కాలేజీలో రెండు రోజులపాటు నిర్వహించిన 'ఎన్‌జీఓలు మరియు అభివృద్ధి రంగం పై అవగాహన' అంశంపై అకాడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం వాలెడిక్టరీ కార్యక్రమం ఘనంగా ముగిసింది. ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల అకడమిక్ కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సామాజిక అవగాహన, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సమాజంతో అనుసంధానమై సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. విద్య అనేది పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాతవాహన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎస్. సుజాత గ్లోబల్ స్కిల్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ, కమ్యూనికేషన్, టెక్నాలజీ, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. గౌరవ అతిథి ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ టి. శ్రీధర్ గ్రామీణ సమస్యలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో ఎన్‌జీఓల పాత్ర, అభివృద్ధి రంగంలో అవకాశాలు, సమాజ సేవలో యువత బాధ్యతలపై విస్తృత చర్చలు జరిగాయి. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌సిసి కేడెట్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ స్ఫూర్తిదాయకంగా ముగిసింది.

# కొండగట్టులో చిన్న హనుమాన్ జయంతి బందోబస్తు

- 914 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత
- భక్తులకు ప్రశాంత దర్శనం కల్పించడమే లక్ష్యం: ఎస్పీ అశోక్ కుమార్



**నేటి సాక్షి, జగిత్యాల(రాధారపు) నర్సయ్య):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జయంతి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున 914 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. భద్రతా ఏర్పాట్లను 5 సెక్టార్లుగా విభజించి, 3 షిఫ్టుల విధానంలో సిబ్బందికి విధులు కేటాయించినట్లు వెల్లడించారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా, క్యూలైన్ విధానాన్ని కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ట్రాఫిక్ జామ్‌లు లేకుండా సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, రాత్రి వేళల్లో ప్రమాదాలు నివారించేందుకు స్టాపర్స్, కోన్స్, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే కాలినడకన వచ్చే భక్తులు జాగ్రత్తగా ప్రయాణించాలని, వారి బ్యాగులు, జెండాలకు రేడియం స్టిక్కర్లు అమర్చినట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పోలీస్ సిబ్బంది ఓపికతో మార్గదర్శనం చేయాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచించారు. ప్రతి భక్తుడు ప్రశాంతంగా దర్శనం చేసుకుని సురక్షితంగా తిరిగి వెళ్లేలా పోలీస్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ బీసీ సర్టిఫికెట్ల మాయాజాలం



**నేటి సాక్షి, చెన్నూర్ (మంచిర్యాల):** సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కొందరు స్వార్థపరులు దుర్వినియోగం చేస్తున్నారని రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ సిద్ధి రమేష్ ఆరోపించారు. మంగళవారం చెన్నూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్థికంగా బలమైన మార్వాడీ సామాజిక వర్గానికి చెందిన కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అక్రమంగా బీసీ-డి సర్టిఫికెట్లు పొందడం సామాజిక న్యాయాన్ని పక్కదోవ పట్టించడమేనని విమర్శించారు. ప్రధానంగా చెన్నూర్‌కు చెందిన ఒక మార్వాడీ వ్యాపారవేత్త, దేవాదాయ శాఖ బోర్డు మెంబర్ హోదాలో ఉండి కూడా ఇలాంటి అక్రమాలకు పాల్పడటం వ్యవస్థలోని లోపాలను బయటపెడుతోందని అన్నారు. రాజస్థాన్‌కు చెందిన మార్వాడీలు తెలంగాణలో ప్రధానంగా వ్యాపార రంగంలో ముందంజలో ఉన్నారని, వారు ఏ రకంగానూ బీసీ కేటగిరీలోకి రారని ఆయన స్పష్టం చేశారు. ఒక రాష్ట్రంలో ఉన్న వర్గీకరణను మరో రాష్ట్రంలో అక్రమంగా వాడుకోవడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఇలాంటి అక్రమ సర్టిఫికెట్ల వల్ల నిజమైన బీసీ యువతకు అందాల్సిన విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు చేజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను కఠినతరం చేయాలని, డిజిటల్ డేటాబేస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా సర్టిఫికెట్లు పొందిన వారిపై మరియు వారికి సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

- అసలైన వెనుకబడిన వర్గాలకు ముప్పు!
- ఓసీలైన మార్వాడీలకు బీసీ-డి సర్టిఫికెట్లు ఇవ్వడంపై బీసీ జేఏసీ చైర్మన్ సిద్ధి రమేష్ ఆగ్రహం
- అక్రమంగా పొందిన వారిపై, సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

# వికారాబాద్‌లో 'మిషన్ ఎయిడ్స్ సురక్ష' ప్రారంభం

- నియంత్రణే లక్ష్యంగా అవగాహన
- ఏప్రిల్ 1 నుండి డిసెంబర్ వరకు ప్రత్యేక కార్యక్రమం.. అధికారులకు డీఎంహెచ్ఓ ఆదేశాలు
- హాట్ స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు.. గర్భవతులపై ప్రత్యేక నిఘా ఉండాలని సూచన




**నేటి సాక్షి,వికారాబాద్:** దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుండి డిసెంబర్ వరకు నిర్వహిస్తున్న 'మిషన్ ఎయిడ్స్ సురక్ష' కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ డి. స్వర్ణకుమారి అధ్యక్షతన, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఏఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. మిషన్ ఎయిడ్స్ సురక్షలో ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. వ్యాధి సోకిన వారిని గుర్తించడం, కనీసం 95 శాతం మందికి చికిత్స అందించడం, వైరస్ తీవ్రతను తగ్గించడం మరియు గర్భవతి నుండి బిడ్డకు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. జిల్లాలో ఐదు కంటే ఎక్కువ కేసులున్న ప్రాంతాలను 'హాట్ స్పాట్లు'గా గుర్తించి ప్రత్యేక వైద్య పరీక్షలు, అవగాహన క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎయిడ్స్ నియంత్రణకు సిబ్బంది సామాజిక బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సమీయుల్లా, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, ప్రోగ్రామ్ మేనేజర్ నరేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సింహులపేటలో ఇసుక మాఫియా దండయాత్ర

- ఆకేరు వాగులో అక్రమ తవ్వకాలు!
  రాత్రిళ్లు ట్రాక్టర్ల పరేడ్‌తో దద్దరిల్లుతున్న రోడ్లు.. అధికారుల మౌనంపై ప్రజల ఆగ్రహం
- సెలెక్టివ్ యాక్షన్ ఆరోపణలు.. కొందరికి 'గ్రీన్ సిగ్నల్'.. కొత్తవారిపైనే 'కఠిన చర్యలు'

**నేటి సాక్షి,మహబూబాబాద్:** నర్సింహులపేట మండలంలో అక్రమ ఇసుక రవాణా పూర్తిగా నియంత్రణ తప్పి, సాండ్ మాఫియా రాజ్యమేలుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆకేరు వాగు పరిసరాల్లో రాత్రి వేళల్లో ఇసుక దోపిడీ ఉధృతంగా సాగుతోంది. అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు వందలాది ట్రాక్టర్లు వరుస కట్టి సంచరిస్తుండటంతో గ్రామీణ రోడ్లు దద్దరిల్లుతున్నాయి. ఈ అక్రమ రవాణా వ్యవస్థీకృత మాఫియా కార్యకలాపంలా మారినా, సంబంధిత శాఖల అధికారులు మౌనం వహించడం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ మరియు పోలీస్ శాఖల మధ్య సమన్వయ లోపం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా పాత వారికి ఇసుక రవాణాకు అనధికారిక అనుమతులు ఇచ్చి, కొత్తగా వచ్చే వారిపై మాత్రం కఠిన చర్యలు తీసుకుంటున్నారని 'సెలెక్టివ్ యాక్షన్' ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ లోడ్లతో వెళ్లే వాహనాల వల్ల రోడ్లు ధ్వంసం కావడమే కాకుండా, భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే



స్పందించి, ఈ ఇసుక దందాను అరికట్టకపోతే పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఉందని నర్సింహులపేట మండల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# క్షేమంగా ఇంటికి చేరడమే 'అరైవ్ అలైవ్' లక్ష్యం



- కొడంగల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం.
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,

**నేటి సాక్షి, వికారాబాద్:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 'అరైవ్ – అలైవ్' (ఙాతీతీఱఙవ-ాశ్రీఱఙవ) డ్రగ్స్ నివారణ అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించి, పలువురికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, నేటి యువత దేశానికి వెన్నెముక అని, అటువంటి యువశక్తిని నిర్వీర్యం చేసేందుకు డ్రగ్స్ మాఫియా పన్నుతున్న కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. డ్రగ్స్ అనే మత్తు ఊబిలో చిక్కుకుని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల సరఫరా గురించి ఎలాంటి సమాచారం ఉన్నా భయం లేకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఎస్పీ భరోసా ఇచ్చారు. అనంతరం 'అరైవ్ – అలైవ్' కార్యక్రమ ఉద్దేశాన్ని వివరిస్తూ.. ప్రతి రోజూ ఉపాధి కోసం బయటకు వెళ్లే వ్యక్తులు తిరిగి క్షేమంగా తమ కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా వాహనదారులు, డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తు.చ తప్పకుండా పాటించాలని, రోడ్డు భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు చూపు స్పష్టంగా ఉండటం అత్యంత కీలకమని, అందుకే డ్రైవర్ల కోసం ఈ ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి డ్రైవర్ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ, ఎంవీఐ వసంత్, కొడంగల్ వైస్ చైర్మన్ శంకర్, స్థానిక కౌన్సెలర్లు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో యువత, వాహనదారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్టీయూ ఉద్యమబాట

- 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలి
- ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు.. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- ఉపాధ్యాయురాలు గాయత్రీ దేవి పదవీ విరమణ సభలో రాష్ట్ర ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి



**నేటి సాక్షి,గజ్వేల్:** విద్యారంగం మరియు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. వర్గల్ మండలం మజీద్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు గాయత్రీ దేవి పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ఘనత పీఆర్టీయూకే దక్కుతుందని కొనియాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు 50 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే పీఆర్సీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. పీఆర్సీ కాలపరిమితి ముగిసి 30 నెలలు గడుస్తున్నా, కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని విమర్శించారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, పదవీ విరమణ పొందిన వారికి బకాయిలను ఒకే విడతలో చెల్లించాలని కోరారు. విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన గాయత్రీ దేవిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సునీత, వంటేరు ప్రతాపరెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర శర్మ, మండల ప్రధాన కార్యదర్శి నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్‌కు దీటుగా వికారాబాద్






- మున్సిపాలిటీకి వందల కోట్ల నిధులు: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- శివసాగర్ చెరువు ఆధునీకీకరణ.. అనంతగిరిలో వెయ్యి కోట్లతో మెగా ప్రాజెక్టు
- రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.. బడ్జెట్ సమావేశంలో వెల్లడి

**నేటి సాక్షి వికారాబాద్:** కొడంగల్ నియోజకవర్గానికి దీటుగా వికారాబాద్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా కర్తవ్యమని రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య అధ్యక్షతన జరిగిన వార్షిక బడ్జెట్ సమావేశంలో ఆయన ఎక్స్ అఫిషియో సభ్యునిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి ఇప్పటికే రూ. 60 కోట్ల ుఖఖీ×ఱజ నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే మరో రూ. 270 కోట్ల ఎవీణూ నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రయత్నిస్తున్నామని, శివసాగర్ చెరువును హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ పార్కు తరహాలో ఆధునీకరిస్తామని తెలిపారు. అనంతగిరిలో రూ. 1000 కోట్లతో చేపట్టబోయే మెగా ప్రాజెక్టు ద్వారా 3 వేల మంది యువతకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా కౌన్సిలర్లందరూ కలిసికట్టుగా పనిచేసి వికారాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని సూచించారు. చైర్‌పర్సన్ గడ్డం అనన్య మాట్లాడుతూ.. ప్రతి వార్డులోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్, కమిషనర్ విక్రం సింహా రెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి మరియు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# లైబ్రరీలో వసతులు కల్పించాలి

## నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



**నేటి సాక్షి,వికారాబాద్:**వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగులకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (DYFI) జిల్లా కార్యదర్శి ఎరుకల సత్యనారాయణ మండిపడ్డారు. బుధవారం లైబ్రరీ సందర్శన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ 200 మందికి పైగా నిరుద్యోగులు పోటీ పరీక్షల కోసం ఇక్కడికి వస్తున్నారని, వారికి కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడం శోచనీయమన్నారు. లైబ్రరీ చైర్మన్ అందుబాటులో ఉండకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు భరోసా ఇవ్వాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. లైబ్రరీలో అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు 1 నుండి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలను అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా లైబ్రరీని తెరిచి ఉంచాలని, జిల్లాలోని అన్ని గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 100 కోట్లు అదనంగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శ్రీనివాస్, కిషన్ నాయక్, గోపాల్, సతీష్, నవీన్, అక్బర్, చందు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెత్తకుప్పగా పాత ఆర్ఐ

## పట్టించుకోని అధికారులు



**నేటి సాక్షి,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని పాత ఆర్ఐ (RI) కార్యాలయం ప్రస్తుతం చెత్తాచెదారంతో నిండిపోయిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయంగా సేవలందించిన ఈ భవనం, నేడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మరియు చెత్త కుప్పగా మారిందని విమర్శిస్తున్నారు. కార్యాలయం ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాల వల్ల తీవ్రమైన దుర్వాసన వస్తోందని, అటుగా వెళ్లే ప్రయాణికులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని మరికల్ పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యపై నారాయణపేట జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు పి. వెంకటేష్ స్పందిస్తూ.. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ఆర్ఐ కార్యాలయంలోని చెత్తను తొలగించి శుభ్రం చేయించాలని కోరారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా పరిణమించిన ఈ చెత్తాచెదారాన్ని వారం రోజుల్లోగా తొలగించకపోతే, సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో పాటు పట్టణ పరిశుభ్రతను పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

# భావోజి జాతరకు బందోబస్తు

## భక్తుల భద్రతే మా లక్ష్యం: ఎస్పీ డాక్టర్ వినీత్



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):**నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఏప్రిల్ 1 నుండి 4వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రసిద్ధ భావోజి జాతరను పురస్కరించుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS తెలిపారు. మంగళవారం జాతర ప్రాంగణాన్ని సందర్శించిన ఆయన, భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో సమీక్షించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో జాతర నిర్వహించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. జాతరలో ప్రధాన ఘట్టమైన 'తేరు' కార్యక్రమం సందర్భంగా నాలుగు దిక్కుల రోప్ పార్టీలను ఏర్పాటు చేయాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామని ఎస్పీ వివరించారు. దొంగతనాలు, ఈవ్ టీజింగ్ అరికట్టేందుకు మఫ్టీ పోలీసులను మోహరించామని, మహిళలు మరియు పిల్లల రక్షణ కోసం ప్రత్యేక బృందాలను కేటాయించినట్లు తెలిపారు. వాహనాల రాకపోకల కోసం ప్రత్యేక ట్రాఫిక్ డైవర్షన్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల కోసం క్యూఆర్టీ (ఉ=ు) టీమ్ మరియు ప్రత్యేక కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, ఎస్సైలు విజయ్ కుమార్, నరేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పౌరహక్కుల దినోత్సవం



**నేటి సాక్షి, జగిత్యాల,(గుండ ప్రశాంత్ గౌడ్):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలోని సర్పంచ్ కాసారపు భవాని-అరవింద్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కాసారపు భవాని-అరవింద్ గౌడ్ మాట్లాడుతూ పౌరులకు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులు అయిన వాక్ స్వాసంత్రం అక్రమ కేసుల నుండి రక్షణ చట్టం ముందు అందరూ సమానులే మరియు అంటరాని తనాన్ని ఎవరు పాటించొద్దు అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసారపు భవాని-అరవింద్ గౌడ్ ఉప సర్పంచ్ సిరవేణి రవి, బుర్ర తిరుపతి గౌడ్ మాజీ సర్పంచ్,గ్రామపంచాయతీ కార్యదర్శి బొమ్మెళ్ళ నరేష్ ,వార్డుమెంబర్లు అరెల్లి నవ్య మోహన్, ఎంద్రికాయాల గంగాధర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ బాపు రెడ్డి,గ్రామ పాలనధికారి జెనర్దన్ బుజ్జక్క ఆశావర్కర్లు, చరణ్ రాజేందర్ మరియు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కంట్రోల్ రూమ్ ఏర్పాటు




**నేటి సాక్షి వికారాబాద్ :** వేసవి కాలంలో త్రాగునీటి సమస్యల నివారణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారము సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయం లో కంట్రోల్ రూమ్ నెం.08416-235291కు కాల్ చేయవచ్చని, వేసవి కాలంలో త్రాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో త్రాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడినదని , ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 వరకు పై నెంబర్ సంప్రదించాలని తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజలు తమ ప్రాంతాల్లో త్రాగునీటి కొరత, పైప్‌లైన్ లీకేజీలు, ట్యాంకర్ సరఫరా లోపాలు వంటి సమస్యలను తెలియజేయవచ్చు. అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమములో ట్రైని కలెక్టర్ హర్ష్ చౌదరి, జడ్ పి సిఇఓ సుదీర్, జిల్లా పంచాయతి అధికారి జయసుధ , ఇఇ రవి కుమార్ తదితరులు ఉన్నారు.

## నేడు సర్పంచులకు సన్మానం



**నేటి సాక్షి,చౌడేపల్లి:** నేడు చౌడేపల్లి మండల వైఎస్ఆర్ సిపి పార్టీ కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటల 30 నిమిషాలకు ప్రారంభమయ్యే సర్పంచుల ఘన సన్మాన కార్యక్రమం కు సంబంధించి మాజీమంత్రివర్యులు,శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి ఆశీస్సులతో గ్రామాల అభివృద్ధి, ప్రజలకు ఏడతేరిపి లేని సేవలందించిన గౌరవ సర్పంచులకు ఐదేళ్ల పదవీకాలం పూర్తి అయిన సందర్భంగా వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించబడుతుంది. గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనలో సర్పంచుల సేవలను గుర్తించి గౌరవిస్తూ ఈ కార్యక్రమాన్ని సర్పంచుల సంఘం అధ్యక్షులు లద్దిగం కృష్ణారెడ్డి , మండల పార్టీ నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కావున మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ నుండి సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యులు హాజరుఅయ్యి జయప్రదం చేయవసిందిగా మండల పార్టీఅధ్యక్షులు నాగభూషణం రెడ్డి కోరుచున్నారు.

## ఆర్థిక సహాయం



**నేటి సాక్షి చేవెళ్ల:** చేవెళ్ల, మండలం అల్లవాడ గ్రామానికి చెందిన స్నేహితుడు అకాల మరణం పొందిన చిరకాల స్నేహితుని కుటుంబానికి అండగా మేమున్నామంటూ ముందుకువచ్చి మైత్రి అన్న మాటకు సరైన నిర్వచనాన్ని అందించారు సాటి పూర్వ విద్యార్థి మిత్రులు. మానసిక ఒత్తిడితో ఇటీవల అల్లావాడ గ్రామానికి చెందిన శివగాళ్ల యాదయ్య ఆత్మహత్యకు పాల్పడి అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న 2011-12 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు తమవంతుగా మిత్రుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించారు. రూ.12,500 సేకరించిన నగదును మంగళవారం మృతుని దశదినకర్మ రోజు మృతుని తల్లి నీలమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దళితమిత్ర యువజన సంఘం గ్రామ ఇంచార్జ్ శివగాళ్ల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు పానుగంటి ప్రవీణ్ శివగాళ్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లవాడ గ్రామ 5వ వార్డ్ మెంబర్ శివగల్ల సత్యానందం పాల్గొన్నారు.


# మహాలక్ష్మితో మహిళలకు రూ. 10 వేల కోట్ల లబ్ధి



- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- లాయల్ ప్యాసింజర్లకు బహుమతుల ప్రధానం.. ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలని పిలుపు
- ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే మిగిలిన హామీలన్నీ అమలు చేస్తాం.. వికారాబాద్‌లో వెల్లడి

**నేటి సాక్షి,వికారాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా తెలంగాణవ్యాప్తంగా మహిళలు రూ. 10 వేల కోట్ల మేర ఆర్థిక లబ్ధి పొందారని రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. బుధవారం వికారాబాద్ బస్టాండ్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో నిరంతరం ప్రయాణిస్తున్న 'లాయల్ ప్యాసింజర్ల'కు స్పీకర్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన మెజారిటీ హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన భారీ అప్పుల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. ఆర్థిక స్థితిగతులు మెరుగుపడగానే మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, స్కూటీలు, తులం బంగారం వంటి హామీలను కూడా త్వరలోనే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలందరూ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజేశ్వరి, వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, ఆర్టీఐ మెంబర్ జాఫర్, డిపో మేనేజర్ నమ్రత మరియు ప్రయాణికులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మకు సన్మానం





- సింగపూర్ ఎన్నారై టేకూరి నాగేశ్వరరావు సేవలకు గుర్తింపు.. తల్లికి గౌరవం
- వృద్ధ దంపతులకు ఇల్లు నిర్మించి ఇవ్వడం అభినందనీయం: మంత్రి పయ్యావుల కేశవ్

**నేటి సాక్షి,నంద్యాల:** నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్రఏ2047' కార్యక్రమంలో భాగంగా పాములపాడు మండలం వేంపెంట గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, సింగపూర్ ఎన్నారై డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు సేవలను ప్రభుత్వం ఘనంగా గుర్తించింది. ఆయన తరపున ఆయన తల్లి, వేంపెంట మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మైనారిటీ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ మరియు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ శాలువాతో సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. నాగేశ్వరరావు లాంటి ఉత్తమ వ్యక్తిత్వం ఉన్న కొడుకును కన్నందుకు రామసుబ్బమ్మ జన్మ ధన్యమైందని కొనియాడారు. నాగేశ్వరరావు సింగపూర్‌లో ఉంటూనే తన సొంత గ్రామంలోని వృద్ధులకు గృహ నిర్మాణం చేపట్టడం, నిరుపేదలకు అండగా నిలవడం గొప్ప విషయమన్నారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. ఎక్కడో సుదూర ప్రాంతంలో ఉన్నా తన ప్రాంత ప్రజల ఎదుగుదల కోసం ఆరాటపడే నాగేశ్వరరావు అందరికీ ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. గతంలో వేంపెంటలో డయేరియా ప్రబలిన సమయంలో ఆయన అందించిన తక్షణ సహాయాన్ని కలెక్టర్ రాజకుమారి ఈ సందర్భంగా గుర్తుచేశారు. వికాలాంగులకు తోడ్పాటు, పేద పిల్లల చదువులకు సాయం వంటి కార్యక్రమాలతో నాగేశ్వరరావు ప్రజల మనిషిగా ఎదిగారని ప్రశంసించారు. తన కుమారుడి సేవా పథాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని రామసుబ్బమ్మ సభాముఖంగా తెలిపారు.

# అమెరికా సామ్రాజ్యవాద విధానాలు నశించాలి




**నేటి సాక్షి మంచిర్యాల్ (శ్రీధర్ దమ్ము):** సిపిఎం పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పూలె భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా లిసిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీలి హాజరై మాట్లాడుతూ.. అమెరికా సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న విధానం వల్ల ప్రపంచ శాంతికి విగాథం కలిగిస్తుంది. అమెరికా తన ఆయుధ సంపత్తిని పెంచుకోవడానికి తమ దగ్గర ఉన్న ఆయుధాల నిలువలను అమ్ముకోవడానికి అన్ని దేశాలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి పెత్తనం చేస్తుంది. యుద్ధాలను సృష్టించడం కోసం వెనిజులా, ఇరాన్,క్యూబా తమకు గిట్టని దేశాలపై కవ్వింపు సైనిక చర్యలు చేస్తూ ప్రపంచంలోని అన్నిదేశాల పైనతమ పెత్తనం కొనసాగిస్తూ అంతర్జాతీయ న్యాయ సూత్రాలన్నిటిని ఉల్లంఘించి ఏకధృవ ప్రపంచం సాధించడం కోసం అమెరికా తప్పుడు పద్ధతుల్లో ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తుంది. యుద్ధాలను తన వ్యాపారాన్ని విస్తరింప చేయడానికి ప్రయత్నం చేస్తుంది. ట్రంపు తమ మాట వినని దేశాలపై విచ్చలవిడిగా పన్నుల శాతాన్ని పెంచి వేస్తుంది. దీనివల్ల అన్ని రకాల వస్తువులపై అధిక ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. ఇన్ని రోజులుగా జరుగుతున్న యుద్ధం వల్ల గ్యాస్ ,పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడి భారతదేశ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురి గురవుతున్నారు. అక్కడ ఎక్కడో యుద్ధం జరిగితే మన ఇండ్లలో సరుకుల ధరలు పెరుగుతున్నాయి. భారతదేశంలో ఎగుమతులు దిగుమతుల పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం వల్ల ఎవరికి లాభంలేదు అమెరికా అధ్యక్షుడు ట్రంపు తప్పుడు విధానాల వల్ల మన దేశ సాధారణ ప్రజలు పేద ప్రజల జీవితాలు చితికి పోతున్నాయి. భారతదేశ పాలకులు స్వతంత్ర విధానం తీసుకోవాలి. అమెరికా ట్రంప్ ఒత్తిళ్లకు తలగొద్దు. మన ప్రజలపైభారాలుపడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ఉపాధి ఉద్యోగాలను కాపాడాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్వాడీ, ఆశ ఉద్యోగ కార్మికులు వేతనాలు పెంపు విషయమై చలో హైదరాబాద్ ధర్నాకు పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా పోలీసులు చేత నాయకులపై కార్యకర్తలపై దాడి చేయడం చాలా దుర్మార్గమని అన్నారు. ఈ దాడిని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అదే విదంగా గ్రామపంచాయతీ, మున్సిపల్, ఐకేపీ వివోఏలు, భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులు చేస్తున్న ఆందోళన పోరాటాలకు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పోరాటాల పైన స్పందించి, తమ న్యాయమైన డిమాండ్స్ నెరవేర్చాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారి రవికుమార్‌లి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మంచిర్యాల జిల్లా అభివృద్ధికి, కాలేశ్వరం ముంపు సమస్యకు,పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఎన్ని నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించారో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ,మంత్రులు చెప్పాలన్నారు. అదేవిధంగా పోడు చేసుకుంటున్న ఆదివాసి గిరిజన పేదలకు హక్కు పత్రాలు ఇవ్వకుండా, ఆదివాసి పేదలపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ అటవీశాఖ అధికారులు ఇబ్బందుల గురిచేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి నీరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు,పెన్షన్స్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పైల్ల ఆశయ్య సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, సంకె రవి జిల్లా కార్యదర్శి,కె,అశోక్,ఎ.పున్నం, బోడంకి చందు,జి. ప్రకాష్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు , ఉమారాణి, మల్లేశ్వరి,లింగన్న, రంజిత్ కుమార్, శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, రాజారాం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఎస్ఐ ఎం. ప్రవీణ్ కుమార్



**నేటి సాక్షి, ధర్మారం:** మండల ప్రజలు చైన్ స్నాచింగ్ వంటి దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎం. ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళవారం ధర్మారం మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ.. మహిళలు బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, బంగారు ఆభరణాలు స్పష్టంగా కనిపించకుండా చూసుకోవాలని తెలిపారు. ఒంటరిగా ప్రయాణించే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనుమానస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని, నేరాల నియంత్రణలో భాగంగా పోలీసు పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరిస్తే ఇటువంటి ఘటనలను సమర్థంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు

# మంచిర్యాలలో శరవేగంగా కరకట్ట పనులు



- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు!
- రూ. 255.59 కోట్లతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం.. పనులను పరిశీలించిన సురేఖమ్మ
- వర్షాకాలంలో పట్టణానికి తప్పనున్న ముప్పు.. పనుల నాణ్యతపై మున్సిపల్ అధికారులకు సూచనలు

**నేటి సాక్షి,మంచిర్యాల (శ్రీధర్ దమ్మ):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్ వద్ద జరుగుతున్న కరకట్ట నిర్మాణ పనులను మంచిర్యాల ఎమ్మెల్యే సతీమణి, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో కాళేశ్వరం బ్యాక్ వాటర్ కారణంగా వర్షాకాలంలో మంచిర్యాల పట్టణం తీవ్రమైన ముంపునకు గురై ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. 2023 శాసనసభ ఎన్నికల ప్రచార సమయంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం.. రూ. 255.59 కోట్ల భారీ నిధులతో ఈ కరకట్ట నిర్మాణం చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పట్టణ ప్రజలకు ముంపు భయం తప్పుతుందని, పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేపీ నరేందర్ రావు సేవలు మరువలేనివి

- ఎంఈఓ ప్రభాకర్
  పత్తిపాక పాఠశాల విద్యాభివృద్ధికి కృషి.. ఘనంగా వీడ్కోలు సన్మానం
- మౌలిక వసతుల కల్పన, గుణాత్మక విద్యలో నరేందర్ రావుది ప్రత్యేక ముద్ర



**నేటి సాక్షి, ధర్మారం:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఖండేరావు పరీక్షిత్ (కేపీ) నరేందర్ రావు అందించిన సేవలు ఉపాధ్యాయ లోకానికి మార్గదర్శకమని మండల విద్యాధికారి (ఎంఈఓ) పోతు ప్రభాకర్ కొనియాడారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో నరేందర్ రావు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లుగా పత్తిపాక పాఠశాల మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా నరేందర్ రావు అంకితభావంతో పనిచేశారని ప్రశంసించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంలో ఆయన పర్యవేక్షణ అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ విద్యా వ్యవస్థ బలోపేతానికి ఆయన నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ధర్మారం మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వసంత, శీలా, వెంకటేశ్వర్లు, సత్యం, రమేష్‌తో పాటు కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు, ఎంఆర్సీ సిబ్బంది మరియు ఉపాధ్యాయులు పాల్గొని నరేందర్ రావును ఘనంగా సన్మానించారు.

# దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కొనసాగించాలి



- సుప్రీంకోర్టు పునర్‌పరిశీలన చేయాలి
- తహశీల్దార్‌కు దళిత క్రిస్టియన్ సంఘాల వినతి.. మతం మారినా వివక్ష మారలేదని ఆవేదన
- కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి: ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

**నేటి సాక్షి, తిరుమలాయపాలెం (రుద్రరాజు):** దళిత క్రిస్టియన్లకు ఎస్సీ రిజర్వేషన్ హోదాను యధావిధిగా కొనసాగించాలని, ఈ విషయంలో సుప్రీంకోర్టు తన నిర్ణయాన్ని పునర్‌పరిశీలించాలని డిమాండ్ చేస్తూ తిరుమలాయపాలెం మండల కేంద్రంలో దళిత క్రిస్టియన్ సంఘాల నాయకులు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మతం మారినంత మాత్రాన కులం మారదని, దళితులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, అణచివేత అలాగే కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ హోదాను రద్దు చేయడం రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం.. మతం మారినంత మాత్రాన ఎస్సీ హక్కులు కోల్పోవాలని ఎక్కడా లేదని వారు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రత్యేక చట్టం తీసుకువచ్చి దళిత క్రిస్టియన్లకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక చైర్మన్ మందడి ఇజ్రాయిల్, మాజీ సర్పంచ్ గడ్డికోపుల రాజు, టేకుమట్ల బాబు, పప్పుల విజయ్ కుమార్, సిపిఐ ఎంఎల్ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, న్యూ డెమోక్రసీ నాయకులు వీరస్వామి, సాల్మన్ రాజు, శ్రీనివాసరావు, కామల్ల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా హరీష్ రెడ్డి జన్మదిన వేడుకలు



- కేక్ కట్ చేసి, పండ్లు-మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నేతలు

**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల పరిధిలోని రాజారాంపల్లి గ్రామంలోని వివేకానంద కూడలిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సోషల్ మీడియా వారియర్ వ్యాళ్ల హరీష్ రెడ్డి 41వ జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంతో మండలంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి, అనంతరం స్థానికులకు పండ్లు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, విదేశాల్లో స్థిరపడినా స్వదేశంపై అపారమైన మమకారంతో ప్రజా సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చిన హరీష్ రెడ్డి యువ నాయకుడిగా వేగంగా ఎదుగుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని, భగవంతుని కృపతో ఆయురారోగ్యాలతో చిరకాలం ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజారాంపల్లి మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం, శానబండ సర్పంచ్ గాదం భాస్కర్, ఉప సర్పంచ్ మెరుగు జానీ, ఏలేటి విజయ్ మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కంది తిరుమల్ రెడ్డి, ఉద్యమకారుడు పడిదం వెంకటేష్, అల్లే వెంకటేష్ యాదవ్, వీహెచ్ఆర్ అభిమానులు సింగిరెడ్డి మహిపాల్ రెడ్డి, కొమ్ము సంజీవ్, దుర్గం కృష్ణ, ఆరెల్లి బాబా రాజ్, తనుగుల జగతి, జల్లెళ్ల కనకయ్య, వనం రమణయ్య, దేవి నరేష్, చెరుక కేశవ్, జక్కుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# గంజాయికి అలవాటుపడిన మైనర్

## డీ-అడిక్షన్ సెంటర్ తరలించిన పోలీసులు




**నేటి సాక్షి మంచిర్యాల:** చెన్నూర్ పట్టణానికి చెందిన 17 సంవంత్సరాల మైనర్ బాలుడు గంజాయి త్రాగుటకు అలవాటుపడటంతో అతనిని ఇవ్వాళ డీ-అడిక్షన్ సెంటర్ కు తరలించడం జరిగింది అని మైనర్ బాలుడు గత కొంతకాలంగా తన స్నేహితులతో కలసి గంజాయి త్రాగుటకు బానిసై నా బాలుడు మహారాష్ట్ర నుండి గంజాయి కొనుగోలు చేసి సేవిస్తుండటంతో గతంలో ఇతనిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసారు,అయిన బాలుని ప్రవర్తన మార్చుకోకుండా తరచు గంజాయి సేవిస్తున్నాడు అని పోలీసులకు సమాచారం రావడంతో అతని పట్టుకొని మెడికల్ ఆఫీసర్ సమక్షంలో గంజాయి పరీక్ష చేసే కిట్టు సహాయంతో వైద్య పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రిపోర్ట్ రావడంతో అతనిపై సెక్షన్ 27 (ఎ) చీఊూా యాక్ట్ ప్రకారం కేసు నమోదుచేసి మైనర్ బాలుడిని చెన్నూర్ న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టి కోర్టు ఆదేశాల ప్రకారం ఈరోజు ఆ మైనర్ బాలుడి ప్రవర్తనలో మార్పు రావడం కొరకు వైద్య చికిత్స నిమిత్తం డీ-అడిక్షన్ సెంటర్, మంచిర్యాల నందు అడ్మిట్ చేయడం జరిగింది అని అన్నారు ఇకపై ఎవరైనా గంజాయి త్రాగుటకు అలవాటు పడిన యువకులు తమ ప్రవర్తన మార్చుకోని యెడల వారిపై కూడా కేసు నమోదు చేసి డీ-అడిక్షన్ సెంటర్ కు తరలించడం జరుగుతుందని పిల్లల తల్లిదండ్రులు కూడా చెడు వ్యాసనాలకు అలవాటుపడిన తమ పిల్లల నడవడిక పట్ల తగు జాగ్రత్త వహించి వారి ప్రవర్తనలో మార్పు రావడం కోరకు పోలీస్ వారికి సహకరించాలని అదేవిధంగా గంజాయి కి అలవాటు పడిన యువకుల సమాచారం తెలిసిన యెడల పోలీస్ వారికి తెలియజేయగలరని అన్నారు

# అరైవ్ అలైవ్ కార్యక్రమం




**నేటిసాక్షి,తిరుమలాయపాలెం (రుద్రరాజు):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం లో మూడవ విడత ఆరైవ్ ఆలైవ్ కార్యక్రమాన్ని ఎస్సై కూచిపూడి జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గురించి ఎస్సై కూచిపూడి జగదీష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోజురోజుకీ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మరణాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఈ అరైవ్ ఆలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. రోడ్డుపై ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెంట్ ధరించకపోవడం, ద్విచక్ర వాహనం నడుపుతూ సెల్ఫోన్ మాట్లాడడం, మద్యం సేవించి వాహనం నడపడం, కార్లలో సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం, సిగ్నల్ జంప్ స్టాప్ లైన్ దాటటం,హైవేలపై ఓవర్ టేకింగ్ వంటివి ప్రమాదకర అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. ప్రమాదాన్ని చూసిన వెంటనే సహాయం చేసే వారికి ప్రభుత్వం రహవీర్ గా గుర్తించి నగదుతో ప్రోత్సహిస్తుందని, పోలీసులు గౌరవం అందిస్తున్నారని అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా వేగ నియంత్రణ సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, యువకులు, ఆటో యూనియన్ వాళ్ళు ,స్థానిక ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పౌర హక్కులకు ఐక్యత అవసరం

## చిలుకూరు లో అవగాహన కార్యక్రమం



**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రం లో జె జె నగర్ సమాజంలో నెలకొన్న అంటరానితనం నిర్మూలనపై ప్రతి నెల చివరి రోజు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పౌర హక్కుల దినోత్సవంను చిలుకూరు గ్రామంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఐ శ్వేత మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని, రాజ్యాంగం అందించిన హక్కులు ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తిస్తాయని వాటి పరిరక్షణలో ప్రజల పాత్ర ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. పౌర హక్కుల సాధనకు చైతన్యం అవసరమని ఆమె స్పష్టం చేశారు. పౌర హక్కులపై అవగాహన పెరగడం వల్ల సమాజంలో సమానత్వం, న్యాయం స్థిరపడతాయని, అంటరానితనం నిర్మూలనలో గ్రామస్థులు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. , ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామ పెద్దలు . పాల్గొన్నారు.

# సిద్ధోగం ఎల్లమ్మ బోనాలు



**నేటి సాక్షి గన్నేరువరం,(బుర్రఅంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో గౌడ కులస్తులు మంగళవారం నాడు రేణుక ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు గ్రామంలో మహిళలు మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకొని గ్రామ పూనకాల మధ్య పోతరాజుల విన్యాసాలు ఊరంతా ఆకట్టుకుంది బైండ్ల పూజారులతో గన్నేరువరానికి గ్రామానికి చెందిన గౌడ కులస్తులు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు అనంతరం ఎల్లమ్మ తల్లికి నైవేద్యం కల్లు శాఖ పోసి మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు బుర్ర తిరుపతి గౌడ్ వేములవాడ ఎస్సై బుర్ర ఎల్లయ్య గౌడ్ బుర్ర మల్లేశం గౌడ్ కోటేష్ గౌడ్ రాజ్ కోటి గౌడ్ సాయి రోహన్ గౌడ్ పాల్గొన్నారు